## సర్ ప్రక్రియలో పాల్గొన్న మంత్రి లోకేష్



2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - బుధవారం 24 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 170 | పేజీలు: 8+4 | వెల రూ.5

## కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



3

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |



# రూ.30 వేల కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్



## రాజధానికి, రాష్ట్ర అభివృద్ధికి పెద్ద పీట: సీఎం చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర కేబినెట్ సమావేశం అత్యంత కీలకమైన అజెండాతో జరిగింది. రాష్ట్రంలో పెట్టుబడులు, అమరావతి రాజధాని నిర్మాణం, నూతన పారిశ్రామిక విధానాలు, భారీ ఉద్యోగాల కల్పన వంటి అంశాలకు ఈ భేటీలో పెద్దపీట వేశారు. 30 వేల కోట్ల పెట్టుబడులకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

(అమరావతి, పి.మీరా హుస్సేన్, మనం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి): ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో రూ. 30 వేల కోట్లకు పైగా భారీ పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దీని ద్వారా దాదాపు 35 వేల మందికి పైగా యువతకు కొత్త ఉద్యోగావకాశాలు ...మిగతా 2లో

## బీసీల విద్యకు 'కూటమి' దన్ను

ఒక్కో గురుకులంలో 37 పోస్టుల భర్తీకి నిర్ణయం

ఇటీవలే 6 ఎంజేపీలను కళాశాలలుగా అప్ గ్రేడ్

బడి బయట బీసీ బిడ్డలు ఉండకూడదనేదే సీఎం చంద్రబాబు లక్ష్యం

బీసీ విద్యకు ప్రాధాన్యమిస్తున్నందుకు సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు



(అమరావతి,జూన్,23,మనం ప్రత్యేక ప్రతినిధి): విద్యతోనే బీసీలు మరింత ఉన్నత స్థానాలకు చేరుకోగలరనేది సీఎం చంద్రబాబునాయుడు బావన. ఇటీవల ఆరు మహాత్మా ...మిగతా 2లో

## ప్రకృతి వ్యవసాయంతో పశుగ్రాస భద్రతకు శ్రీకారం

పచ్చిమేత కొరత నివారణకు చర్యలు

వర్షాభావాన్ని అధిగమించేందుకు పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రణాళిక

కరపత్రాలను విడుదల చేసిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



2



## బూతు సంస్కృతికి కేరాఫ్ అడ్రస్ వైసీపీ:మంత్రి కందుల దుర్గేష్

కూటమి ఐక్యతను చూసి ఓర్వలేకనే వైసీపీ రాజకీయ ముసుగు లాటలు

సాయికృష్ణ కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతోంది

నిందితుడైన సీఐ నాగరాజు సస్పెన్షన్, సిట్ విచారణ ముమ్మరం

కులాల మధ్య చిచ్చు పెట్టడమే వైసీపీ నైజం: మంత్రి దుర్గేష్ సవాల్

2

## మళ్లీ బిల్లు సిద్ధం?

2

- ఈసారి 133వ రాజ్యాంగ సవరణగా..
- మహిళా చట్టం అమలు కోసం మళ్లీ తెరపైకి డీలిమిటేషన్



## థాంక్స్ సీఎం సార్!

### చంద్రబాబుకు ఉద్యోగ సంఘాల ధన్యవాదాలు



అమరావతి,పి.మీరాహుస్సేన్, జూన్ 23(మనం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి): కేబినెట్ సమావేశంలో ఉద్యోగులకు మేలు చేసేలా తీసుకున్న నిర్ణయాలపై ఉద్యోగ సంఘాలు నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలు, సొసైటీల్లో ఉద్యోగ విరమణ వయస్సు 60 నుంచి 62కు పెంపు, 2004 సెప్టెంబర్ కు ముందు నోటిఫికేషన్లతో నియామకమైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ మేరకు వివిధ ఉద్యోగ సంఘాలకు చెందిన ప్రతినిధులు సీఎం చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా తీసుకున్న వివిధ నిర్ణయాలతో తాము ఊరట పొందుతున్నామని ...మిగతా 2లో

## అమరావతిలో కేంద్ర మంత్రి పర్యటన



రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారం : కేంద్ర సహాయ మంత్రి తోకన్ సాహు

సీఎం చంద్రబాబు విజన్తో అమరావతి నిర్మాణం వేగంగా సాగుతోంది: కేంద్ర మంత్రి

(అమరావతి, జూన్ 23,మనం ప్రతినిధి): కేంద్ర గృహ నిర్మాణ మరియు పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి తోకన్ సాహు తో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ మంగళవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అనంతరం సీఆర్డీయే కార్యాలయంలో రాష్ట్రంలోని పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ రంగాల్లో అమలవుతున్న పథకాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, డైరెక్టర్ సంపత్ కుమార్, గృహ నిర్మాణ శాఖ ఎండీ అరుణ్ కుమార్, టిడ్కో ఎండీ సునీల్ కుమార్ రెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్ కుమార్ రెడ్డి, చైర్మన్ పట్టాభిరామ్తో పాటు హడ్కో, మెప్మా, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు ...మిగతా 2లో





# అరుదైన గౌరవ





- మురళీమోహన్, రాజేంద్ర ప్రసాద్‌లకు పద్మశ్రీ ప్రదానం

తెలుగు చలనచిత్ర పరిశ్రమకు మరో అరుదైన, అత్యున్నత గౌరవం దక్కింది. టాలీవుడ్ సీనియర్ నటులు నటకిరీటి రాజేంద్ర ప్రసాద్ , మురళీ మోహన్ లను కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది. కళా రంగానికి వారు చేసిన విశేష సేవలను గుర్తిస్తూ భారత ప్రభుత్వం ఈ అవార్డును ప్రకటించిన విషయం తెల్సిందే. మంగళవారం సాయంత్రం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ ఇద్దరు నటులకు పద్మశ్రీ అవార్డు దక్కడంపై టాలీవుడ్ లో పండగ వాతావరణం నెలకొంది. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు రాజేంద్ర ప్రసాద్, మురళీ మోహన్ లకు సామాజిక మాధ్యమాల వేదికగా ఘనంగా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. దశాబ్దాల పాటు తెలుగు సినీ రంగాన్ని తమ నటనతో, వ్యక్తిత్వంతో ఏలిన ఈ ఇద్దరు సీనియర్ నటులకు ఈ పురస్కారం దక్కడం సముచితమని నెటిజన్స్ ...మిగతా 2లో



# తుంగ'భద్రం'



గేట్లు సిద్ధం..

2

25న కొత్తగేట్లు ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

2024లో వచ్చిన వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన 19వ గేటు

నిపుణుల కమిటీ సూచనతో 6 నెలల్లో రూ.51 కోట్లతో 33 కొత్తగేట్ల అమరిక



2

# రాయలసీమలో 'పసిడి' పంట స్వర్ణగిరిగా... ఇక జొన్నగిరి

రూ.405 కోట్లతో జియో మైసూర్ సర్వీసెస్, డెక్కన్ గోల్డ్ మైన్స్ పెట్టుబడి

దశల వారీగా పెరగనున్న బంగారం వెలికితీత గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

విస్తరణలో భాగంగా రెండో యూనిట్‌కు శంకుస్థాపన

# రూ.30 వేల కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

లభించనున్నాయి. ప్రజా రాజధాని అమరావతిలో మౌలిక వసతుల కల్పన, ట్విన్ టవర్స్ నిర్మాణం, మరియు జోనల్ సిస్టమ్ ఏర్పాటుకు సంబంధించిన అజెండా అంశాలపై మంత్రివర్గం చర్చించింది. ఐటీ, పర్యాటకం, పునరుత్పాదక ఇంధన రంగాలకు ప్రోత్సాహకాలు కల్పించే కీలక పాలసీలకు కేబినెట్ పచ్చజెండా ఊపింది. రాష్ట్రంలో ప్యాసింజర్ సామర్థ్యం పెంపు, 9 కొత్త ఎయిర్ పోర్టులు, మరియు 10 వాటర్ డ్రోముల అభివృద్ధి ప్రణాళికలపై సమావేశంలో సమీక్ష జరిగింది.కేబినెట్ పూర్తి స్థాయి నిర్ణయాలు, ప్రాజెక్టుల వారీగా ఆమోదాలు ఇతర పాలసీలకు సంబంధించిన వివరాలను సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థ సారధి వెల్లడించారు.

# బీసీల విద్యకు 'కూటమి' దన్ను

(మొదటి పేజీ తరువాయి)

జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసింది. ఇపుడు బీసీ విద్యార్థులకు మేలు కలిగేలా నూతన విద్య సంస్థలు నెలకొల్పాలని నిర్ణయించారు. రాష్ట్రంలో కొత్తగా పది మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.ఈ కొత్త గురుకులాల్లో 37 మంది చొప్పున్న ఉద్యోగులను భర్తీ చేయనున్నారు. ఈమేరకు మంగళవారం సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో జరిగిన కేబినెట్ భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో బీసీ బిడ్డలందరూ విద్య అభ్యసించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బడి బయట ఏ బీసీ బిడ్డా ఉండకూడదనేది సీఎం చంద్రబాబు ప్రధాన ఉద్దేశం. దీనిలో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక వైపు బీసీ హాస్టళ్లు, మరో ఎంజేపీ గురుకులాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోంది. సకాలంలో డైట్ బిల్లులు, కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తోంది. మారుతున్న పరిస్థితులకనుగుణంగా సాంకేతిక విద్యకు కూడా ప్రాధాన్యమిస్తోంది. దీంతో బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్లలో తమ పిల్లలను చేర్పించడానికి విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపతున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం ఎంజేపీ గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేయడం, కొత్త గురుకులాలను ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టింది. ఇటీవల 6 గురుకులాలు అప్ గ్రేడ్ ఎంజేపీ గురుకులాల సీట్లకు డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఇటీవల ఆరు బీసీ గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసింది. కొత్తవలస(విజయనగరం), ఆత్మకూరు, గోలగముడి(నెల్లూరు), కలికిరి(అన్నమయ్య), ఓనిపెంట (కడప), నాసనకోట (శ్రీ సత్యసాయి జిల్లా) ఎంజేపీ గురుకుల పాఠశాలలను అప్ గ్రేడ్ చేశారు. ఆయా గురుకులాలల్లో తరగతులు సైతం ప్రారంభమయ్యాయి.

### కొత్తగా 10 గురుకులాల ఏర్పాటు

తాజాగా కొత్త గురుకుల పాఠశాలలను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం జరిగిన కేబినెట్ భేటీలో మంత్రమండలి ఆమోదం కూడా తెలిపింది. చ్చెర్ల(శ్రీకాకుళం), నక్కపల్లి(అనకాపల్లి), మాచెర్ల(పల్నాడు), గిద్దలూరు(మార్కాపురం), గుంతకల్లు(అనంతపురం), రాయచోటి(అన్నమయ్య), పత్తికొండ, మంత్రాలయం(కర్నూలు), పెనుకొండ,కదిరి(శ్రీసత్యసాయి) లో ఎంజేపీ గురుకులాలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో గురుకులంలో 37 బోధన, బోధనేతర పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ గురుకుల పాఠశాలలో అయిదు బాలికలు, మరో అయిదు బాలుర పాఠశాలలను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే తరగతలను ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నూతన ఎంజేపీ గురుకులాల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల్లోని బీసీ బిడ్డలకు మరింత మేలు జరగనుంది.

### సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు

బడి బయట ఏ ఒక్క బీసీ బిడ్డా ఉండకూడదనే సీఎం చంద్రబాబు లక్ష్యాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు. బీసీల విద్యకు ప్రాధాన్యమిస్తూ, కొత్తగా పది ఎంజేపీ గురుకుల పాఠశాలల ఏర్పాటుపై ఆమె హర్షం వ్యక్తంచేశారు. ఈ గురుకులాల ఏర్పాటుతో మరింతమంది పేద బీసీ బిడ్డలు చదువుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఎంజేపీ గురుకులాల్లో ఆహార భద్రత, రక్షణతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తున్నారన్నారు. గత నెలలో విడుదలైన టెన్త్, ఇంటర్ ఫలితాల్లో బీసీ బిడ్డలు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఇటీవలే ఆరు బీసీ గురుకులాలను జూనియర్ కళాశాలలుగా కూటమి ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసిందన్నారు. బీసీల విద్య కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్న సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్ కు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు.

# రాయలసీమలో 'పసిడి' పంట
# స్వర్ణగిరిగా... ఇక జొన్నగిరి

(మొదటి పేజీ తరువాయి)

**తుగ్గలి జూన్ 23 (మనం న్యూస్):** బంగారు నిక్షేపాల గని అంటే కర్నాటక రాష్ట్రంలోని కేజీఎఫ్ గుర్తొచ్చేది... కానీ ఇప్పుడు ఆ స్థానంలో జొన్నగిరి పేరు మారుమోగనుంది. కరవు కేకలు వినిపించిన ఒకప్పటి కర్నూలు జిల్లా ఇక బంగారం ఉత్పత్తికి ప్రధాన వేదిక కానుంది. దేశంలోనే ప్రైవేట్ రంగంలో అతిపెద్ద గోల్ మైనింగ్ ప్రాజెక్టు కర్నూలు జిల్లా జొన్నగిరిలో ఏర్పాటైంది. జొన్నగిరి గోల్ ఫీల్డ్కు ప్రభుత్వం 1,500 ఎకరాల భూమిని కేటాయించింది. ప్రస్తుతం మొదటి దశలో 600 ఎకరాల్లో తవ్వకాలు జరగనున్నాయి. దీనికి తగినట్టుగా ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటయ్యాయి. రెండో దశలో మిగిలిన ప్రాంతంలోనూ ప్లాంట్ విస్తరించున్నారు. ప్రస్తుతం ఏర్పాటైన ఈ ప్లాంట్ ద్వారా తొలి ఏడాదికి 400 కిలోల పసిడిని ఉత్పత్తి చేయనున్నారు. వచ్చే ఏడాది నుంచి 900 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తారు. ఈ రకంగా ఏ ఏడాదికి ఆ ఏడాది ఉత్పత్తి పెరుగుతూ... ఏడాదికి 2 టన్నుల వరకు బంగారం ఉత్పత్తి చేయనున్నారు. ఈ మేరకు ప్లాంట్ సామర్థ్యాన్ని ప్రాసెసింగ్ కెపాసిటీని విస్తరించనున్నారు. ఈ ప్లాంట్ ద్వారా 700 మందికి ఉపాధి లభిస్తుంది. ఇక ఉత్పత్తి చేసిన బంగారం ధరలో 4 శాతం రాష్ట్రానికి రాయల్టీగా వస్తుంది. మొదట తీసే 400 కేజీలకు రూ.57 కోట్లు, 900 కేజీలకు రూ.144 కోట్ల వరకూ రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం రానుంది.

### ప్రారంభోత్సవం... శంకుస్థాపన

కర్నూలు జిల్లా, తుగ్గలి మండలం, జొన్నగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం గోల్ మైనింగ్ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. అనంతరం ప్లాంట్ విస్తరణలో భాగంగా రెండో యూనిట్కు శంకుస్థాపన చేయనున్నారు. జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డెక్కన్ గోల్ మైన్స్ లిమిటెడ్ సంస్థలు రూ.405 కోట్ల పెట్టుబడితో బంగారు నిక్షేపాలు వెలికితీసే ఈ కర్మాగారాన్ని నెలకొల్పాయి. ఇందుకు అవసరమైన నీటి కోసం హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా 18 కి.మీ. పైపులైన్తో 0.021 టీఎంసీలను వినియోగించనున్నారు. ఈ మేరకు రేపు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా బంగారం ఉత్పత్తి పనులు ప్రారంభంకానున్నాయి. దీనికి సంబంధించి ఇప్పటికే గనిలో ట్రయల్ రన్స్ కూడా పూర్తయ్యాయి.

### ముఖ్యమంత్రి పర్యటన వివరాలు

కర్నూలు జిల్లాలో బుధవారం సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. జొన్నగిరిలో బంగారం శుద్ధి కర్మాగారం ప్రారంభోత్సవం సహా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరి 11.30 గంటలకు జొన్నగిరికి చేరుకుంటారు. 11.45 గంటలకు ప్లాంట్ మొదటి యూనిట్ ను ప్రారంభించి... అనంతరం జీఈఓ మైసూర్ ప్లాంట్ రెండో యూనిట్కు శంకుస్థాపన చేయనున్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం 12.20 గంటలకు జొన్నగిరిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. 3 గంటలకు పత్తికొండ నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం అవుతారు.

# అరుదైన గౌరవం

(మొదటి పేజీ తరువాయి)

ప్రశంసిస్తున్నారు. ఇక వీరు కాకుండా మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి, స్టార్ నటుడు ఆర్. మాధవన్ తో పాటు క్రికెటర్ రోహిత్ శర్మ కూడా పద్మశ్రీ అవార్డులను అందుకున్నారు.

### దిగ్గజానికి పద్మశ్రీ

భారత క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ దేశ నాలుగో అత్యున్నత పౌర పురస్కారమైన 'పద్మశ్రీ'ని అందుకున్నారు. రాష్ట్రపతి భవన్లో జరిగిన పద్మ పురస్కారాల రెండో దశ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు. వ్యక్తిగత కారణాల వల్ల మే నెలలో జరిగిన మొదటి దశ కార్యక్రమానికి హాజరుకాలేకపోయిన 39 ఏళ్ల రోహిత్ శర్మ, ఈ వేడుకకు తన భార్య రితికా సజ్దేతో కలిసి హాజరయ్యారు. అవార్డును స్వీకరించడానికి ముందు రోహిత్ ప్రధాని నరేంద్ర మోదీకి అభివాదం చేశారు. ఈ వేడుకలో హాకీ స్టార్ సవితా పునియాకు పద్మశ్రీ, టెన్నిస్ దిగ్గజం విజయ్ అమృత్రాజ్కు పద్మభూషణ్ లభించగా, ప్రముఖ నటుడు మమ్ముట్టి, గాయని అల్కా యాగ్నిక్, ఆంకాలజిస్ట్ దత్తాత్రేయుడు నోరి కూడా పురస్కారాలు అందుకున్నారు. రోహిత్ శర్మ పద్మశ్రీ అవార్డు అందుకోవడం వెనుక ఒక అరుదైన 19 ఏళ్ల సెంటిమెంట్ దాగి ఉంది. ఆయన సరిగ్గా 19 ఏళ్ల క్రితం, అంటే 2007 జూన్ 23న అంతర్జాతీయ క్రికెట్లోకి అరంగేట్రం చేశారు. తన అరంగేట్రం రోజే ఈ అత్యున్నత పురస్కారాన్ని అందుకోవడం విశేషం. రోహిత్ శర్మ సారథ్యంలో భారత జట్టు టీ20 వరల్ కప్ 2024, ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 టైటిళ్లను గెలుచుకుంది. ప్రస్తుతం టెస్టులు, టీ20 అంతర్జాతీయ క్రికెట్కు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్, కేవలం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నారు.

# థాంక్స్ సీఎం సార్!

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగ సంఘ నేతలు సీఎంకు వివరించారు. సుదీర్ఘ కాలంగా పెండింగులో ఉన్న వివిధ సమస్యల పరిష్కారంతో ఉద్యోగులకు, ఉద్యోగుల కుటుంబాలకు ఎంతో లబ్ది కలుగుతోందని వెల్లడించారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ఎప్పటికీ మరువలేమన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రజల కోసం ఉద్యోగులు పని చేయాలని సీఎం ఉద్యోగ సంఘాల నేతలకు సూచించారు. ఉద్యోగ సంఘాలన్నీ కలిసి కట్టుగా రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఏపీఎన్జీఓ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విద్యాసాగర్, ప్రసాద్, ఏపీ సచివాలయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, నాపా ప్రసాద్ సహా సీపీఎస్, పీఎస్ యూ ఉద్యోగుల అసోసియేషన్, గురుకుల, సొసైటీలు, డీఎస్సీ-2003 ఉపాధ్యాయుల సంఘానికి చెందిన నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ధన్యవాదాలు తెలియచేశారు.

# ప్రకృతి వ్యవసాయంతో పశుగ్రాస భద్రతకు శ్రీకారం

**అమరావతి, జూన్ 23,మనం ప్రతినిధి:** రాష్ట్రంలో రానున్న వ్యవసాయ సీజన్లో ఎల్నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాల నేపథ్యంలో పశుసంపద రక్షణ, పశుపోషకుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ చేపట్టింది. వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ పశువులకు పచ్చిమేత కొరత తలెత్తకుండా చూడాలనే లక్ష్యంతో పశుసంవర్ధక శాఖ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పశుగ్రాసాల సాగును ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్ (క్రైఖి) విధానంపై రూపొందించిన అవగాహన కరపత్రాలను రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం విజయవాడలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావం వ్యవసాయంతో పాటు పశుసంపదపై కూడా పడుతున్న నేపథ్యంలో రైతులు, పశుపోషకులు పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

# అమరావతిలో కేంద్ర మంత్రి పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్రంలో పురపాలక, గృహ నిర్మాణ శాఖల ద్వారా అమలవుతున్న వివిధ పథకాల పురోగతిని అధికారులు కేంద్ర మంత్రికి వివరించారు. ముఖ్యంగా టిడ్కో ఇళ్ల నిర్మాణ ప్రస్తుత స్థితి, మెప్మా ద్వారా అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు, ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం, అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి కేంద్ర సహాయ మంత్రి తోకన్ సాహుకు కృతజ్ఞతలు తెలిపారు.

ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రతి నెలా నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ, ప్రజా భాగస్వామ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. కేంద్ర సహాయ మంత్రి తోకన్ సాహు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి నిర్మాణానికి రూపొందించిన విజన్ను అభినందించారు. ఆధునిక సౌకర్యాలు, సమగ్ర ప్రణాళికతో అమరావతి దేశంలోనే ఆదర్శవంతమైన రాజధానిగా రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు.

కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ప్రజలకు సేవలందిస్తున్న డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల కారణంగా అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా అమలవుతున్నాయని ఆయన తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని కేంద్ర సహాయ మంత్రి స్పష్టం చేశారు.

# మళ్లీ బిల్లు సిద్ధం?

**ఢిల్లీ, జూన్ 23:** చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని భావించిన డీలిమిటేషన్ మళ్లీ తెరపైకి వస్తోంది. ఇందుకోసం మరోసారి రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. అత్యున్నత స్థాయిలో ఇప్పటికే సంప్రదింపుల ప్రక్రియ పూర్తయినట్లు సమాచారం. ఈసారి 133వ రాజ్యాంగ సవరణ బిల్లుగా దీనిని తీసుకురానున్నట్లు తెలుస్తోంది. గత బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రతిపక్షాల వ్యతిరేకత కారణంగా వీగిపోయిన సంగతి తెలిసిందే. ప్రతిపక్షాలు, రాష్ట్రాలు లేవనెత్తిన అనేక అభ్యంతరాలకు ఈసారి తీసుకొచ్చే బిల్లులో పరిష్కారాలను సూచించనున్నట్లు తెలుస్తోంది. 1971 జనాభా లెక్కల ప్రకారం ప్రస్తుతమున్న అంతర్రాష్ట్ర సీట్ల నిష్పత్తిలో ఎటువంటి మార్పులు లేకుండా బిల్లును రూపొందించినట్లు సమాచారం. అయితే 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రాల్లో అంతర్గతంగా నియోజకవర్గాల సరిహద్దులు మారనున్నాయి. బిల్లు ఇప్పటికే సిద్ధమైందని, 55, 81, 82, 170, 330, 332, 334ఏ ఆర్టికళ్లకు ఇది సవరణను సూచిస్తుందని తెలుస్తోంది. అందరికీ సమానంగా లోక్సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో 50శాతం సీట్లను పెంచేలా ప్రతిపాదనలున్నట్లు సమాచారం.

### ఎస్సీ, ఎస్టీ సీట్ల పెరుగుదల

డీలిమిటేషన్ తర్వాత లోక్సభలో ప్రస్తుతమున్న 84 ఎస్సీ సీట్లు 136కు పెరుగుతాయి. ప్రస్తుతం ఎస్సీలకు 15.46 శాతం సీట్లు రిజర్వుకాగా అవి 16శాతానికి విస్తరిస్తాయి. ఎస్టీ సీట్లు 47 నుంచి 70కి ఎగబాకుతాయి.

# సర్ ప్రక్రియలో పాల్గొన్న మంత్రి లోకేష్

**తాడేపల్లి, జూన్ 23, మనం న్యూస్:** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఖిఐఖ) ప్రక్రియలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఉండవల్లి లోని తమ నివాసానికి వచ్చిన బూత్ లెవల్ ఆఫీసర్ అడిగిన సమాచారం, డాక్యుమెంట్లను మంత్రి లోకేష్ సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిఒక్కరూ ఈ ప్రక్రియలో పాల్గొనాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సర్ ప్రక్రియలో పాల్గొనే ప్రజలు ఏదైనా డౌట్లు ఉంటే ఆయా వార్డుల్లో నియమితులైన బీఎల్ఓలను సంప్రదించాలని, ఇందుకోసం సహకరించేందుకు తెలుగుదేశం పార్టీ తరపున బూత్ లెవల్ ఏజంట్లు కూడా అందుబాటులో ఉంటారని చెప్పారు.

# తుంగ'భద్రం' గేట్లు సిద్ధం..



(అమరావతి, జూన్ 23,మనం ప్రత్యేక ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు వర ప్రదాయిని అయిన తుంగభద్ర ప్రాజెక్టు ఇప్పుడు కొత్తగేట్ల అమరికతో సరికొత్త రూపును సంతరించుకుంది. రూ.51 కోట్ల వ్యయంతో మొత్తం 33 గేట్ల ఏర్పాటు పనులు పూర్తికాగా, వీటిని ఈ నెల 25వ తేదీన కర్నాటక ముఖ్యమంత్రి శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి సీఆర్ పాటిల్తో కలిసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. 73 ఏళ్ల క్రితం నిర్మించిన తుంగభద్ర ప్రాజెక్టు రెండు రాష్ట్రాల్లో లక్షల ఎకరాల ఆయకట్టుకు జీవనాడిగా నిలుస్తోంది. అయితే 2024 ఆగస్టులో వచ్చిన వరద ప్రవాహానికి 19వ గేటు కొట్టుకుపోయింది. అప్పటికప్పుడు నీటి వృధాను అడ్డుకునేందుకు ఏపీ ప్రభుత్వ చొరవతో, సీఎం చంద్రబాబు సూచనతో సీనియర్ ఇంజనీర్ కన్నయ్య నాయుడు నేతృత్వం వహించి స్టాప్లాక్ గేటును అమర్చారు. స్పిల్ వే గేట్లు అన్నీ మార్చాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ౄఖిఅ) నివేదిక ఇవ్వడంతో 6 నెలల్లో కొత్తగేట్లను పూర్తి చేసి ఏపీ-కర్నాటక రాష్ట్రాలు పునరుజ్జీవం పోశాయి.

### ఏపీలో 1.46 లక్షల ఎకరాలకు నీరు

తుంగభద్ర ప్రాజెక్టు ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు, వందల గ్రామాలకు తాగునీరుతో ఏపీ, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలకు కీలకంగా ఉంది. ఒక్క ఆంధ్రప్రదేశ్లోనే తుంగభద్ర ప్రాజెక్టు కింద 1.46 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతోంది. కుడి కాలువ ద్వారా కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు సాగు నీరందుతోంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు భద్రతను ఏపీ-కర్నాటక రాష్ట్రాలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని గేట్ల ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేశాయి. 25వ తేదీన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని హొస్పేటలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.

# బూతు సంస్కృతికి కేరాఫ్ అడ్రస్ వైసీపీ:మంత్రి కందుల దుర్గేష్

(అమరావతి,పి.మీరాహుస్సేన్, మనం ప్రత్యేక ప్రతినిధి): రాజకీయ నాయకుల ప్రవర్తనా నియమావళి మరియు నైతిక విలువల గురించి విపక్ష వైసీపీ నేతల నుండి నేర్చుకోవాల్సిన దౌర్భాగ్య స్థితిలో రాష్ట్ర రాజకీయం లేదని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలోని 4వ బ్లాక్ పబ్లిసిటీ సెల్లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన వైసీపీ నేతల వైఖరిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

**విలువల గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదు:మంత్రి దుర్గేష్**

గత ఐదేళ్ల కాలంలో వైసీపీ నేతలు ప్రదర్శించిన అసభ్యకర సంస్కృతిని మంత్రి దుర్గేష్ తీవ్రంగా ఖండించారు. నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ మోహన్ రెడ్డి, నాటి సీఎం చంద్రబాబు నాయుడుని నడిరోడ్డుపై ఉరితీయాలని చేసిన వ్యాఖ్యలను ఆదర్శంగా తీసుకోవాలా? అని ప్రశ్నించారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు, ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి వంటి నేతలు సీఎం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాతృమూర్తిపై చేసిన వ్యక్తిగత, అసభ్యకర దూషణలను రాష్ట్ర ప్రజలు ఇంకా మర్చిపోలేదని గుర్తుచేశారు. రాజకీయాల్లో విలువల్లేని వ్యవస్థను పెంచి పోషించిన పార్టీ వైసీపీ మాత్రమేనని ఎద్దేవా చేశారు.

**సాయికృష్ణ కేసులో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది:మంత్రి దుర్గేష్**

సాయికృష్ణ అదృశ్యం కేసులో కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, చట్టబద్ధంగా వ్యవహరిస్తోందని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. కేసు తీవ్రతను బట్టి నిందితుడైన సీఐ నాగరాజును తక్షణమే సస్పెండ్ చేయడం జరిగిందన్నారు.తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నేతృత్వంలో విచారణాధికారిని నియమించడమే కాకుండా, లోతుగా దర్యాప్తు చేయడానికి ప్రత్యేక విచారణ బృందాన్ని(సిట్) ఏర్పాటు చేశామన్నారు. సిట్ అధికారులు ఇప్పటికే సీఐ నాగరాజును అదుపులోకి తీసుకోవడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.

**కులాల మధ్య చిచ్చు పెట్టే కుట్రలు:మంత్రి దుర్గేష్**

సాయికృష్ణ కేసును అడ్డం పెట్టుకొని ద్రాక్షారామం, కాకినాడల్లో వైసీపీ నేతలు కులాల పేరుతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ సమాజంలో విభజన తేవాలని చూస్తున్నారని మంత్రి దుర్గేష్ మండిపడ్డారు. ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా దానికి కులం రంగు పూసి రాజకీయ లబ్ధి పొందడమే ధ్యేయంగా వైసీపీ దిగజారిపోయిందని విమర్శించారు. ప్రభుత్వం తప్పు చేస్తే నిర్మాణాత్మక సూచనలు ఇవ్వాలే తప్ప, ప్రతి అంశంలోనూ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని లాగి, ఆయనను ఒక కులానికి పరిమితం చేయాలని చూస్తే ప్రజలు క్షమించరన్నారు. 'తాను పుట్టిన కులం పట్ల గౌరవం ఉన్నప్పటికీ, రాజకీయంలో ఉన్న వ్యక్తిగా అన్ని కులాలను సమానంగా చూస్తానని, అందరి అభివృద్ధికి పాటుపడతానని జనసేనాని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఆయన ఉన్నత వ్యక్తిత్వాన్ని తక్కువ చేసేందుకు వైసీపీ చేస్తున్న ప్రయత్నాలు హాస్యాస్పదం.' అని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ గతంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను గుర్తుచేశారు.

**కూటమి బలపడుతుందనే భయం వైసీపీది**

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఇలాగే బలంగా ఉంటే భవిష్యత్తులో తాము ఎప్పటికీ అధికారంలోకి రాలేమని, రాజకీయ నిరుద్యోగులుగా మిగిలిపోతామనే భయంతోనే వైసీపీ నేతలు ఈ విధమైన ఉన్మాద తాండవాలు చేస్తున్నారని మంత్రి దుర్గేష్ ఎద్దేవా చేశారు. కాపు సంక్షేమం కోసం వైసీపీ ఏం చేసిందో డేటా ఉంటే చూపించడంటూ సవాల్ కాపు సామాజికవర్గం పట్ల వైసీపీకి ఉన్న దొంగ ప్రేమని మంత్రి కందుల దుర్గేష్ తూర్పారబట్టారు. 2019-24 మధ్య కాలంలో కాపు కార్పొరేషన్కు ఎంత నిధులు కేటాయించారో, ఎంతమంది కాపు యువతకు విదేశీ విద్యకు సహాయం చేశారో, కాపు భవనాలకు ఎంత నిధులు ఇచ్చారో ఆ డేటా ఉంటే చూపించాలని సవాల్ విసిరారు. 2014-19 మధ్య కాలంలో జనసేన, బీజేపీ సపోర్ట్ తో టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కాపు సంక్షేమ పథకాలను అధికారంలోకి రాగానే రద్దు చేసిన చరిత్ర వైసీపీదని మండిపడ్డారు.నాడు సామర్లకోటలో జగన్ పర్యటన సందర్భంగా కాపులకు ఈడబ్ల్యూఎస్ పథకం వర్తింపజేయమని చెబితే నాడు నోరుమెదపని వైసీపీ కాపు నేతలు, నేడు ఏ మొహం పెట్టుకొని మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. నాడు గిద్దలూరులో వెంగయ్య అనే యువకుడు తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కావాలని అడిగినందుకు వైసీపీ ఎమ్మెల్యే దూషించడంతో ఆత్మహత్య చేసుకున్నప్పుడు, లేదా ఎంతోమంది యువకులు బలిపశువులైనప్పుడు రాని ఈ కుల ప్రేమ, మీటింగ్లు నేడు ఎందుకు వస్తున్నాయని నిలదీశారు.వైసీపీ నేతల వైఖరి గురివింద గింజ చందంగా ఉందన్నారు. వైసీపీ నేతలకు భవిష్యత్తు లేదనే నగ్నసత్యం బోధపడే రోడ్లపై గావుకేకలు పెడుతున్నారన్నారు.వైసీపీ నేతలు వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు...ఇది రాజకీయంగా మంచి విధానం కాదని హితవు పలికారు.. కులాల మధ్య చిచ్చు పెట్టడం తప్ప ఇంకేమీ సమస్యలు లేవా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు తమ భాషను, ప్రవర్తనను మార్చుకొని పద్ధతిగా మాట్లాడాలని, లేనిపక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని మంత్రి దుర్గేష్ హెచ్చరించారు.

# అమెరికా పౌరసత్వం మరింత ఖరీదు..!

**వాషింగ్టన్, జూన్ 23:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇమిగ్రేషన్ రూల్స్ను కఠినతరం చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆయన కార్యవర్గం చేసిన ప్రతిపాదనలతో అమెరికా పౌరసత్వం మరింత ఖరీదుగా మారనుంది. పౌరసత్వ దరఖాస్తుల ఫైలింగ్ ఫీజులను 75 శాతం మేర పెంచాలని యూఎస్ డిపార్ట్మెంట్ ఆఫ్ హోమ్లాండ్ సెక్యూరిటీ ప్రతిపాదించింది. సక్రమ మార్గంలో వచ్చిన వలసదారులు పౌరసత్వానికి దరఖాస్తు చేసుకుంటే ప్రాసెసింగ్, వెట్టింగ్ ఖర్చులు భరించాల్సిరావడంతో పాటు ఇప్పటివరకు ఉన్న పలు మినహాయింపులను కూడా కోల్పోనున్నారు. పౌరసత్వ దరఖాస్తు (పేపర్ బేస్డ్) ఫైల్ చేయడానికి ఫీజు 760 డాలర్ల నుంచి 1330 డాలర్లకు పెరగనుంది. ఆన్లైన్ దరఖాస్తు విషయానికొస్తే 710 డాలర్ల నుంచి 1280 డాలర్లకు ఫీజు పెంపును అధికారులు ప్రతిపాదించారు. ఈ కొత్త ఫీజులు అమల్లోకి వస్తే 75 శాతం మేర భారం పడనుంది. ఏదైనా సిటిజన్షిప్ అప్లికేషన్ తిరస్కరణకు గురైతే దానిని తిరిగి పరిశీలించాలని కోరినా సరే ఖర్చుల మోత మోగనుంది. ఆ రుసుము 830 డాలర్ల నుంచి 1475 డాలర్లకు అంటే 645 డాలర్ల మేర పెరగనుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదిత నిబంధనలపై 60 రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నారు. అలాగే అమెరికాలో ఆదాయ ఆధారిత మార్గదర్శకాల ప్రకారం.. దరఖాస్తుదారులకు ప్రస్తుతం లభిస్తోన్న మినహాయింపులను తొలగించాలని డీహెచ్ఎస్ ప్రతిపాదించింది.

# ట్రంప్తో ఏకాభిప్రాయం లేదు

- ఇరాన్కు అణ్వాయుధాలు దక్కనివ్వం
- ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు

**జెరూసలెం, జూన్ 23:** పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ తన ఆదేశాలను పాటిస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఆ దేశ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ఖండించారు. కొన్ని విషయాల్లో తమ మధ్య ఏకాభిప్రాయం లేదన్నారు. ''ట్రంప్ నేను కోరుకున్నవన్నీ చేయరు. అలాగే ఆయన కోరుకున్నవన్నీ నేను చేయను. మేము స్వతంత్ర దేశాల నాయకులం. కొన్నిసార్లు మా అభిప్రాయాలు కలవవు. మా మధ్య ఏకాభిప్రాయం లేదు. అయినా మేము మా ప్రయోజనాల కోసం కలిసి నిలబడతాము. ఇజ్రాయెల్ ప్రయోజనాలు, భద్రత నాకు ముఖ్యం'' అని జెరూసలెంలో నిర్వహించిన ఓ సదస్సులో నెతన్యాహు పేర్కొన్నారు. అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందం కుదిరినా, కుదరకపోయినా టెహ్రాన్కు తాము అణ్వాయుధం దక్కనివ్వబోమని నెతన్యాహు తేల్చిచెప్పారు. తాను ఇజ్రాయెల్ ప్రధానిగా ఉన్నంత కాలం ఇరాన్ అణ్వాయుధాన్ని పొందే అవకాశం లేదని ఉద్ఘాటించారు. ఈ అంశంలో ఎలాంటి దౌత్య పరిణామాలు చోటుచేసుకున్నా సరే, తన నిర్ణయం మారదని స్పష్టం చేశారు.

**ఇరాన్ నేతతో డోభాల్ భేటీ**

ఇరాన్ సుప్రీం జాతీయ భద్రతా మండలి (ఎస్ఎన్ఎస్సీ)లో రక్షణ వ్యవహారాల ఉప కార్యదర్శిగా ఉన్న ఘాదిర్ నెజామీపౌర్తో భారత జాతీయ భద్రత సలహాదారు (ఎన్ఎస్ఏ) అజీత్ డోభాల్ దిల్లీలో సోమవారం భేటీ అయ్యారు. పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితులపై వారిద్దరూ చర్చించారు. బ్రిక్స్ ఎన్ఎస్ఏల సమావేశంలో పాల్గొనేందుకు నెజామీపౌర్ భారత్కు వచ్చారు.

## శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా భద్రత పై ప్రత్యేక అవగాహన



**తిరుపతి జూన్23 మనం న్యూస్:** మహిళల భద్రత సైబర్ నేరాలపై మహిళా పోలీస్ స్టేషన్ అడిషనల్ ఎస్పీ శ్రీలత మంగళవారం వెంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజీలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఆదేశాల మేరకు మహిళా పోలీస్ స్టేషన్ అదనపు ఎస్పీ శ్రీలత ఆధ్వర్యంలో తిరుపతి సమీపంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల, కారకంబాడిలో షక్తి టీమ్ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీలత పాల్గొని మహిళల భద్రత, సమాజంలో పెరుగుతున్న వివిధ రకాల నేరాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వంటి సామాజిక సమస్యల వల్ల కలిగే పరిణామాలను వివరించి, ఇటువంటి ఘటనలను సహించకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అలాగే మహిళల భద్రత కోసం రూపొందించిన షక్తి యాప్ వినియోగంపై వివరించారు.

## బడి యే ప్రత్యక్ష దేవాలయం



- ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి సంరక్షించాలి
- మట్లవారిపల్లిలో డీఈఓ సుబ్రహ్మణ్యం పిలుపు

**రామసముద్రం, జూన్ 23 మనం న్యూస్ :** విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి గ్రామస్తులు, దాతలు, తల్లిదండ్రులు సమిష్టిగా ముందుకు రావాలని అన్నమయ్య జిల్లా డీఈఓ సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. మండలంలోని మట్లవారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో సిఎన్ఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన నోట్బుక్స్ పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామంలో గుడి ఎంత పవిత్రమో, బడి కూడా అంతే పవిత్రం బడి యే ప్రత్యక్ష దేవాలయమని పేర్కొన్నారు. విద్య ద్వారానే పిల్లలకు జ్ఞానం, సంస్కారం, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం లభిస్తాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో ఉపాధ్యాయుల పాత్రతో పాటు గ్రామస్తుల సహకారం కూడా ఎంతో కీలకమన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం సేవాభావంతో ముందుకు వస్తున్న దాతలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు.

## ఉద్యోగస్తుల సంఘాల నుంచి వచ్చిన వినతలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తాం



- డి ఆర్ ఓ కే మోహన్ కుమార్

**చిత్తూరు జూన్23 మనం న్యూస్:** వివిధ ఉద్యోగస్తుల సంఘాల నుంచి వచ్చిన వినతలను, జిల్లా కలెక్టర్ తో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తాంమని డి ఆర్ ఓ కే మోహన్ కుమార్ పేర్కొన్నారు, మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని డిఆర్ఓ సమావేశం మందిరంలోఏపీ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో అధ్యక్షులు కె.వి.రాఘవులు కార్యదర్శి కె.రమేష్, టీచర్ సంఘాలు యూటీఎఫ్, ఏపీటీఎఫ్ 1938 పి ఆర్ టి యు, ఏపీ ఉపాధ్యాయ సంఘం,ఎపి గవర్నమెంటు ఉద్యోగుల సంఘం, ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్,ఆర్టిసి, నర్సింగ్, ఔట్సోర్సింగ్, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం,, క్లాస్ ఫోర్ డ్రైవర్ల సంఘ నాయకులు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగస్తులకు రావలసిన వివిధ సౌకర్యాలను కల్పించడానికి కృషి చేయడం జరుగుతుందని పేర్కొన్నారుఈ కార్యక్రమంలో ముఖ్యంగా 12వ పి.ఆర్.సి అమలు, పెండింగ్ డిఎ లవిడుదల, సరెండర్ లీవ్ చెల్లింపులు మొదలుగా ఆర్థిక మరియు ఆర్థికేతర అంశాలపై సుదీర్ఘమైన చర్చలు డి ఆర్ వో సమక్షంలో సమీక్షించారు

# శాస్త్రోక్తంగా శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

### జూన్ 24న అంకురార్పణతో వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

### జూన్ 29న గరుడసేవ - జూలై 2న రథోత్సవం



**తిరుపతి జూన్23 మనం న్యూస్:** అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందుగా నిర్వహించే పవిత్రమైన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం మంగళవారం అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా జరిగింది. జూన్ 24 నుండి జూలై 3 వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయ పవిత్రత, ఆధ్యాత్మిక శోభను మరింత పెంపొందించే ఈ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, తోమాలసేవ, కొలువు, అర్చన అనంతరం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఆలయ గర్భగుడి, ప్రాకారాలు, గోడలు, పైకప్పు, పూజా సామగ్రిని శుద్ధి చేసి, నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం, కుంకుమ, కిచిలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలతో తయారుచేసిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షించారు. ఈ పవిత్ర కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక సుగంధాలతో పరిమళించి, భక్తిమయ వాతావరణాన్ని సంతరించుకుంది. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు.వార్షిక బ్రహ్మోత్సవాలకు నాంది పలుకుతూ జూన్ 24న రాత్రి 7.30 గంటలకు అంకురార్పణం నిర్వహించనున్నారు. జూన్ 25న ధ్వజారోహణంతో సకల దేవతలను ఆహ్వానిస్తూ బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమవుతాయి. ఉత్సవాల్లో భాగంగా జూన్ 28న ఆర్జిత కల్యాణోత్సవం, జూన్ 29న గరుడసేవ, జూలై 2న రథోత్సవం, జూలై 3న చక్రస్నానం, ధ్వజావరోహణం నిర్వహించి బ్రహ్మోత్సవాలను ముగించనున్నారు.ఈ దివ్య బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి కృపాకటాక్షాలను పొందాలని టీటీడీ కోరుతోంది.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, అర్చకులు, అధికారులు, సిబ్బంది, వారి సేవకులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**రేణిగుంట, జూన్ 23 మనం న్యూస్:** జిల్లాకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచిన గోదాము వద్ద 247 నిరంతరం నిఘా, పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మార్గదర్శకాలు ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా తిరుపతి జిల్లా రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ గోడౌన్ నందు భద్రపరచబడిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్, సి డబ్ల్యూ సి గోదామును మంగళవారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గోదాములో భద్రపరిచిన ఈవీఎం యంత్రాలు బియులు, సియూలు, వివి ప్యాట్ లను, అక్కడి భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాలు, సీలింగ్ తదితరాలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేసారు. అనంతరం ఈవీఎం గోడౌన్ రిజిస్టర్ నందు సంతకం చేశారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల తర్వాత ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్స్ లు గోడౌన్లో భద్రపరచడం జరిగిందని, ప్రతి నెల మూడు నెలలకు ఒకసారి గోడౌన్ లోపల పరిశీలించడం జరుగుతుందన్నారు. ఈవీఎం గోడౌన్ లోపల మరమ్మతులు ఏమైనా ఉన్నాయా అన్ని పరిశీలించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే ఈరోజు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సందర్శించడం జరిగిందన్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా విద్యుత్ అవసరాలు సరి చూసుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో శ్రీ కాళహస్తి ఆర్ డి ఓ భాను ప్రకాష్ రెడ్డి, ఈవిఎం గోడౌన్ ఇంఛార్జి,జిఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భరత్ నాయక్, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ భాగ్యలక్ష్మి, రేణిగుంట శ్రావణ కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ పురోగతిలో విశిష్ట ఫలితాలు సాధించిన రవాణశాఖ



**శ్రీకాళహస్తి జూన్ 23 మనం న్యూస్:** తిరుపతి జిల్లా రవాణా శాఖ కార్యాలయాలు ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించడంలో విశిష్ట ఫలితాలను సాధిస్తున్నాయని జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలిపారు.ప్రభుత్వ సేవలపై ప్రజల అభిప్రాయాలను అంచనా వేయుటకు నిర్వహిం చబడుతున్న ఫీడ్బ్యాక్ వ్యవస్థలో, మోటారు వాహన తనిఖీ అధికారి చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో పుత్తూరు మోటార్ వాహనాల తనిఖీ అధికారి కార్యాలయం గత రెండు నెలలుగా వరుసగా 100 శాతం పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ (పి3) నమోదు చేసి రాష్ట్రంలో వరుసగా రెండు సార్లు ప్రథమ స్థానం పొందడం విశేషమని అదేవిధంగా, మోటారు వాహన తనిఖీ అధికారి దామోదర నాయుడి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి మోటార్ వాహనాల తనిఖీ అధికారి కార్యాలయం 96 శాతం పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ నమోదు చేసి రాష్ట్రంలో ద్వితీయ స్థానం పొందడం కూడా ప్రశంసనీయమని తెలిపారు.ఈ ఫలితాలు సంబంధిత మోటార్ వాహనాల తనిఖీ అధికారులు, సహాయ మోటార్ వాహనాల తనిఖీ అధికారులు కార్యాలయ సిబ్బంది ప్రజలకు అందిస్తున్న సేవల నాణ్యతకు, వారి అంకితభావానికి, క్రమశిక్షణకుసేవా దృక్పథానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు సత్వర, పారదర్శక మర్యాదపూర్వక సేవలు అందించడంతో పాటు, సమస్యల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించడం వల్లనే ఈ స్థాయి ప్రజాదరణ లభించిందని తెలిపారు.

## 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచారం విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే నల్లారి కిషోర్



**కలికిరి జూన్ 23 మనం న్యూస్ :** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ ఫలితాలను ప్రజలకు నేరుగా చేరవేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన '2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని పీలేరు నియోజకవర్గంలో విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కలికిరి మండలం నగిరిపల్లి ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, మార్కెట్ యార్డ్ చైర్మన్లు, మండల, పట్టణ, గ్రామ అధ్యక్ష కార్యదర్శులు, క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇన్చార్జిలు బూత్ కన్వీనర్లు,కార్యకర్తలు, నల్లారి అభిమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 25 నుండి 35 రోజుల పాటు డోర్ టు డోర్ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జ్లు సమన్వయంతో ఇంటింటికి తిరిగి రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, సుపరిపాలన, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలను కరపత్రాల ద్వారా ప్రతి ఇంటికీ చేరవేయాలని కోరారు. ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని, వారి సందేహాలు నివృత్తి చేయాలన్నారు. ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేసి ప్రజల నమ్మకాన్ని మరింత పెంచాలని సూచించారు.

## కత్తిపూడి జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- ఒకరు మృతి.. మరొక వ్యక్తి పరిస్థితి విషమం



**శంఖవరం జూన్ 23 మనం ప్రతినిధి:** కాకినాడ జిల్లా శంఖవరం మండలం లోని కత్తిపూడి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనతో కత్తిపూడి, శంఖవరం గ్రామాల్లో విషాద ఛాయలు నెలకొన్నాయి. స్థానికులు, అన్నవరం పోలీసుల తెలిపిన వివరాలు ప్రకారం శంఖవరం గ్రామానికి చెందిన రోకల కార్తీక్ (19), స్థానిక అంబేద్కర్ కాలనీకి చెందిన మెరుగుల స్వరూప్ కుమార్ (18) ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా కత్తిపూడి నుండి అన్నవరం వైపు వెళ్లే మార్గంలో పెట్రోల్ బంకు సమీపంలో ప్రమాదానికి గురయ్యారు. వేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురైనట్లు రోడ్డు ప్రయాణికులు వెల్లడించినట్లు సమాచారం. ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండటంతో రోకల కార్తీక్ కు తలకు, శరీరంలోని పలుచోట్ల తీవ్ర గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు. మరోవైపు స్వరూప్ కుమార్ కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికుల సహాయంతో ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించగా అతని పరిస్థితి అత్యంత విషమంగా మారడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్వరూప్ కుమార్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. సమాచారం అందుకున్న వెంటనే అన్నవరం ఎస్సై ప్రసాద్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. యువకుడు కార్తీక్ మృతి వార్త తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు ఆసుపత్రికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువకుడు అకాల మరణం చెందడంతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. అంబేద్కర్ కాలనీకి చెందిన స్వరూప్ కుమార్ కోలుకోవాలని కుటుంబికులు కాలనీ ప్రజలు కోరుకుంటున్నారు. పోలీసులు ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నారు.

## నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలి



**తిరుపతి, జూన్ 23(మనంప్రతినిధిః** తిరుపతి జిల్లాలో ఆహార భద్రత ప్రమాణాల చట్టం, 2006 అమలులో భాగంగా ఆహార భద్రతాధికారులు వివిధ ఆహార వ్యాపార సంస్థల నుండి సేకరించిన ఆహార నమూనాలను ప్రభుత్వ ఆహార ప్రయోగశాలలకు పంపగా, వాటిలో కొన్ని నమూనాలు నాణ్యత లోపం కలిగినవి, తప్పుడు లేబులింగ్ కలిగినవి గా నిర్ధారణ అయినవి. ఈ మేరకు సంబంధిత ఆహార వ్యాపార నిర్వాహకులపై ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం, 2006 ప్రకారం కేసులు నమోదు చేసి, తిరుపతి జిల్లా అడ్జుడికేటింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ ఎదుట విచారణకు పంపించబడినవి. విచారణ అనంతరం మొత్తం 19 కేసులలో సంబంధిత ఆహార వ్యాపార నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకొని, కేసుల తీవ్రత, ఉల్లంఘన స్వభావం మరియు ప్రజారోగ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రూ. 3.14 లక్షల మేర జరిమానాలు విధించబడినవి. ఈ కేసులలో తిరుపతి జిల్లా, చిన్నగొట్టిగల్లు మండలం, బాకరాపేటలోని ఒక ఐస్క్రీమ్ దుకాణం నుండి సేకరించిన వెన్నెల ఐస్క్రీమ్ నమూనా నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడంతో సంబంధిత వ్యాపారిపై రూ.6,000/- జరిమానా విధించబడింది. అలాగే తిరుపతి నగరంలోని వెంగమాంబ సర్కిల్ వద్ద గల ఒక బేకరీ స్వీట్ షాప్ నుండి సేకరించిన ఆలూ చిప్స్ నమూనా నాణ్యత లేనిదిగా నిర్ధారణ కావడంతో సంబంధిత వ్యాపారిపై రూ.15,000/- జరిమానా విధించబడింది.

## ముగ్గురు ఆడబిడ్డలను దత్తత తీసుకున్న రవాణా శాఖ అధికారి శ్రీనివాస్



**అమలాపురం జూన్ 23 మనం న్యూస్:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం కె.జగన్నాధపురం గ్రామానికి చెందిన పిచ్చిక సత్యనారాయణ పక్షవాతంతో బాధ పడుతూ గుండె పోటుతో ఈ నెల 19వ తేదీన మృతి చెందారు.ఆయన భార్య సరస్వతి పూర్తి మానసిక దివ్యాంగురాలు.వారికి ముగ్గురు ఆడ బిడ్డలు ఉన్నారు.దాంతో తండ్రికి ఆ ఆడ బిడ్డలే అంత్య క్రియలు నిర్వహించారు. అటువంటి నిరుపేద చేనేత కుటుంబానికి అండగా నేనున్నాను అంటూ జిల్లా రవాణా శాఖ అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ముందుకు వచ్చారు.ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి..4 పథకంలో భాగంగా ఆయన మూడు కుటుంబాలను దత్తత తీసుకున్నారు.ముగ్గురు ఆడ బిడ్డలతో పాటు మానసిక దివ్యాంగురాలైన తల్లి పరిస్థితిని స్వయంగా చూసిన ఆయన పి..4 లో భాగంగా ఆ కుటుంబాన్ని దత్తత తీసుకున్నట్టు గ్రామ పెద్దల సమక్షంలో మంగళవారం ప్రకటించారు.వారి కుటుంబానికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తానని చెప్పారు.అంతేకాకుండా వారి కుటుంబానికి సుమారు మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు.దివ్యాంగురాలైన తల్లికి అప్పటికి అప్పుడు ఫ్యాన్ సదుపాయం కల్పించారు.వారికి అవసరమైన వస్త్రాలు అన్ని సమకూర్చనున్నట్టు తెలిపారు . ఆ నిరుపేద కుటుంబాన్ని దత్తత తీసుకున్న జిల్లా రవాణా శాఖ అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు కు గ్రామపెద్దలు ములికి విఘ్నేశ్వరుడు,అంకం వీర్రాజు, ఇనుమర్తి రాజు,కోట సత్తిరాజు, కొంకి వెంకట్రావు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఇనుమర్తి లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు

## గూగూడు గ్రామానికి సందర్శించిన జిల్లా ఎస్పీ

**నార్పల: జూన్ 23మనం న్యూస్:** మతసామరస్యానికి అంతర్రాష్ట్ర ప్రసిద్ధి చెందిన కుల్లాయి స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా జిల్లా ఎస్పీ జగదీష్, డి.ఎస్.పి శ్రీనివాసులు గూగూడు గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కుల్లాయి స్వామి, ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాల నిర్వహణలో భద్రత ఏర్పాట్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతోనూ సమావేశమయ్యారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా పటిష్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నామని, ప్రత్యక్షంగా తాను పర్యవేక్షిస్తానని గ్రామ పెద్దలకు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై సాగర్, ఆలయ ఈవో శోభ, ఆలయ కమిటీ చైర్మన్ నాగార్జున, దేవాదాయ శాఖ పరివేక్షణ అధికారి వెంకటేశులు, గ్రామ పెద్దలు జాఫర్ వలి, మాజీ ఆలయ చైర్మన్ తలారి రాజన్న తదితరులు పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వంలో దళితులకు రక్షణ కరవైంది



మాజీ ఎంపీ తలారి రంగయ్య

**కళ్యాణదుర్గం జూన్ 23 మనం న్యూస్:** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ పాలనలో దళితులపై దాడులు విపరీతంగా పెరిగిపోయాయని, వారికి రక్షణ కల్పించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ పార్లమెంట్ సభ్యులు, కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కళ్యాణదుర్గం పట్టణంలోని వైస్సార్సీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు జంబుగుంపుల తిప్పేస్వామి అధ్యక్షతన నిర్వహించిన ఎస్సీ సెల్ నాయకుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్ విశిష్ట అతిథులుగా పాల్గొని, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కూటమి ప్రభుత్వం ఖూనీ చేస్తోంది - తలారి రంగయ్య కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుండి రాష్ట్రంలో దళిత సామాజిక వర్గాలపై దాడులు, అరాచకాలు నిత్యకృత్యంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ దళితుల పక్షాన నిలబడుతుందని, వారి హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

## లెగసి వేస్ట్ డిస్పోజల్ నిర్దేశిత సమయంలోపు పూర్తి చేయాలి



- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం, కలెక్టరేట్ జూన్ 23 : మనం న్యూస్ :** జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలో లెగసి వేస్ట్ డిస్పోజల్ నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో లెగసి వేస్ట్ మేనేజ్మెంట్ పై పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులు, ఏజెన్సీలతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో లెగసి వేస్ట్ మేనేజ్మెంట్ పేజ్-1 కింద 16.68 కోట్ల రూపాయలతో అనంతపురం కార్పొరేషన్, గుంతకల్లు, తాడిపత్రి, గుత్తి, కళ్యాణదుర్గం, రాయదుర్గం మున్సిపాలిటీల పరిధిలో తమిళనాడులోని ఈరోడ్ కు చెందిన మెస్సర్స్ జిగ్మా గ్లోబల్ ఎన్విరాన్ సొల్యూషన్స్ ఏజెన్సీ వారు పనులను చేపట్టడం జరగగా, వేగవంతంగా లెగసీ వేస్ట్ మేనేజ్మెంట్ చేపట్టాలన్నారు.

## ఆడ.. పిల్ల

కష్టం విలువ తెలిసిన ఆడది
ఇష్టాల్ని చంపుకొని బ్రతికేస్తుంది
నష్టాన్ని దరి చేరకుండా భద్రపరుచుకుంటుంది
కన్నీళ్లు కంటిగడప దాటిపోకుండా
నిగ్రహం వహిస్తుంది ఒక్కపూట తిన్నా రాణిలా
హుందాగా గడుపుతుంది
ఒంటరి పరుగే అయినా
నవ్వుతూ గమ్యాన్ని వెతుకుతుంది
తన అలసట తెలియనీయకుండా
చెమటను పవుటకొంగుతో కప్పెట్టేస్తుంది
నిరంతర పోరాటమే అనంతరం ఆరాటమే
మదిలో ఆలోచనల గలాట
ప్రతి తలంపులో వేదనల తలాట
చెప్పుటకలవిగాని కోలాటాల నడుమ
చిక్కుకున్న చందమే ఆడపిల్లమ్మ
బ్రతకనిద్దాం బరువేమవుతుంది
భవిష్యత్ బావుందనుకో...
నీ.. నా... బాధ్యత తీసుకుంటుంది
లేదనుకో ఎవడో ఎదవ చేతిలో బలవుతుంది
ఆడ.. పిల్ల కదా..! ఈడ.. పిల్ల కాదు కదా...!!
రాబందుల లోకంలో..
ఊరకుక్కల చెరలో వున్నాం కదూ..!

**- వాసి జ్యోత్స్న**
9866843005

## స్నేహం

అందరు మిత్రులు కారు
హలో మిత్రులు... లాభాపేక్ష కోరే మిత్రులు
మిత్రత్వంలో శత్రుత్వ మిత్రులు
కొందరే కొందరు
శ్రేయస్సు కోరే మిత్రులు
ఒకరో ఇద్దరో యశస్సు కోరే
మిత్రద్వయాలు
నిజమైన మిత్రుడు దొరికిన నాడు
వాడు అదృష్ట వంతుడు...
స్నేహం...కలకండ ముక్కలు
ప్రేమానురాగాల తేనె చుక్కలు
తుది దాక మరుల మొలక లా
వెంట ఉండే...ప్రాణానికి ప్రాణహితుడు
మిత్రత్వం లో సర్వోన్నతడు

**- రేడియమ్**
9291527757

## జన్ జి!

అన్ని తరాలు
గానుగెద్దుల్లా కాలాన్ని మోయవు
అవి బొద్దింకలే కావచ్చు

ఒకచోట గుమిగూడితే ప్రకంపనలు!
ఒక తరం తర్కించుకుని
ఏకాభిప్రాయానికి వచ్చిందా
గత కాలపు విలువలన్నీ
తలకిందులు కాక తప్పదు!

ప్రజాస్వామ్యం
ప్రమాదంలో పడినప్పుడు
ఒక్క ఇన్స్టాగ్రామ్ చాలు
వరుస తుఫానులు సృష్టించడానికి!
బలమైన చేతులు ఇకపై
గోళ్లు గిల్లుకుంటాయనే భ్రమలొద్దు
పునాదులు తవ్వి చూస్తాయి
చేతుల్లోని మొబైల్స్ అందర్నీ ఏకం చేస్తాయి!
ఒక్క పిలుపు చాలు
మేడిపండు ప్రజాస్వామ్యమా
నీ రహస్య తంత్రులను తెంచి
నిప్పులు రాజేయడానికి!

దేశపు వెన్నెముకలు
నిటారుగా నిలబడ యత్నిస్తుంటే
బ్రతకలేక బ్రతుకీడుస్తున్న పెద్ద తరమా
లేచి చప్పట్లు కొట్టక తప్పదు!!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
9440233261

ఎడిట్ పేజీ కోసం
మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.

ఈ పేపర్ కోసం
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి
- ఎడిటర్

# పాఠశాల ప్రగతికి 'గ్రంథాలయం' మెట్టు



వినడం, చదవడం, రాయడం బాల్యాన్ని ప్రభావితం చేసే శక్తివంతమైన ఆయుధాలు. తొలకరిలోనే ఈ ఆయుధాలను ధరించడం వల్ల సృజనాత్మక ఆలోచనలకు పుట్టినిల్లుగా మారుతుంది. ఇందుకు గ్రంథాలయాలు ప్రధానంగా తోడ్పడుతాయి. పాఠశాల స్థాయిలో మెదడుకు మేత పెట్టే పుస్తకాలు అందుబాటులో ఉంచడం వల్ల పుస్తక పఠనం, పరిశీలన, అవగాహన, ఆలోచనాత్మక అనుభవం ప్రోది చేసుకునే అవకాశముంటుంది. పిల్లలు తరగతివారి విద్యా సామర్థ్యాలు సాధించడానికి భాషను రాయడం, చదవడం తప్పనిసరి. ఇందుకు సరైన అవకాశాలు ఏర్పరచకపోతే విద్యార్థికి మనం తీవ్ర నష్టాన్ని కలిగించినవారమవుతాము. పిల్లలు విషయ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడానికి తరగతి గది లేదా ఇంటివద్ద తగినన్ని కథల పుస్తకాలు, మ్యాగజైన్లు, వార్తా పత్రికలు, పిల్లల పత్రికలు అందుబాటులో ఉంచాలి. ఈమేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వెయ్యికిపైగా పాఠశాలల్లో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని తలపెట్టడం పిల్లల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచేందుకు దోహదపడుతుంది.

గ్రంథాలయాలు ఊహాశక్తిని పెంపొందిస్తాయి. ప్రపంచానికి కిటికీలు తెరుస్తాయి. జీవితంలో లక్ష్యాన్ని సాధించడానికి, జీవ నాణ్యతను మెరుగుపరచడానికి తోడ్పడుతుంది. అందువల్ల బాల్యం నుంచే పిల్లలకు గ్రంథాలయంను పరిచయం చేయాలి. రకరకాల పుస్తకాలు చదివే అలవాటును పెంపొందించాలి. పాఠ్యాంశాలు, హోంవర్క్ నుంచి విరామం పొందేలా గ్రంథాలయాలు రూపుదిద్దుకోవాలి. జ్ఞానాన్ని వెతకడానికి, కొత్త సమాచారం పొందడానికి అవసరమయ్యే పుస్తకాలు అందుబాటులో ఉండాలి. దీంతో విద్యార్థులు తమ జీవితాల్లో చదివే కళను అలవర్చుకుని తమ విద్యకు సహాయపడే శక్తిని పొందుతారు. భాష, సాహిత్యం, సాంస్కృతిక చైతన్యం పరిమళించడానికి దారులు వేస్తాయి. భావితరాలకు చరిత్రను అందించే వేదికలుగా నిలుస్తాయి. గ్రంథాలు, శిలా శాసనాలు, తాళపత్రాలు, రాగి రేకులు తదితరమైనవి కాలక్రమేణా కనుమరుగై తెరలమీదకు రూపాంతరం చెందాయి. మూఢాచారాలను పారద్రోలి ప్రజల్లో చైతన్యం నింపడానికి ఒకప్పుడు గ్రంథాలయ ఉద్యమాలు సాగాయి.



మహాత్మాగాంధీ తదితర జాతీయ నాయకులు, రచయితలు రాసిన వ్యాసాలు, గ్రంథాలు నాడు దేశవ్యాప్తంగా గ్రంథాలయ ఉద్యమాల ద్వారానే ప్రజలకు చేర్చి, చైతన్యపరిచినవి. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఏటా నవంబరు 14 నుంచి 20 వరకు నిర్వహించే సాంప్రదాయం మన దేశంలో 1968లో ప్రారంభమైంది. చదువరులను గ్రంథాలయాలు ఆకర్షించడానికి ఏప్రిల్లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాన్ని పాటించే సాంప్రదాయాన్ని 'అమెరికన్ లైబ్రరీ అసోసియేషన్' 1958లో ప్రారంభించింది. తర్వాత దీన్ని అనేక దేశాలు అనుసరించాయి.

కేంద్ర ప్రభుత్వం 2023 బడ్జెట్లో చిన్న పిల్లలకు సంబంధించిన నాణ్యమైన సమాచారాన్ని (పుస్తకాలు, ఆడియో, విజువల్, బొమ్మల పుస్తకాలు) 'నేషనల్ డిజిటల్ లైబ్రరీ'లో పొందుపరిచే అవకాశం కలుగజేసింది. తెలంగాణ ప్రభుత్వం కూడా 'మన ఊరు-మన బడి' పథకంలో భాగంగా గ్రంథాలయాల అభివృద్ధికి తోడ్పడింది. ఈమేరకు 2023 జూన్ 20న విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యాశాఖ పది వేల ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాలు, రీడింగ్ కార్నర్లు, 1,600స్మార్ట్ తరగతి గదులను ప్రారంభించింది. ఇందులో జాగ్రఫీ, భాషలు, శైలి సహా వివిధ స్థాయిల్లో నాణ్యమైన విషయ పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. తాజాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 1,138 పాఠశాలల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీంతో ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులకు రీడింగ్, రైటింగ్ స్కిల్స్, సమాజం పట్ల అవగాహన కలిగివుండడానికి అవకాశాలు మెరుగు కానున్నాయి. ఇప్పటికీ కొన్ని ప్రైవేటు సంస్థలు విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తిని కలిగిస్తున్నాయి. 'రూమ్ టు రీడ్' అనే సంస్థ నాలుగేళ్లుగా ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలలకు వెయ్యికిపైగా రకరకాల పుస్తకాలు అందించి గ్రంథాలయాలను ఏర్పాటు చేసింది. విద్యార్థులు చదివేందుకు ఇష్టపడే విధంగా గదికి రంగురంగుల పెయింటింగ్ చేసి కథలు, నవలలు, రంగురంగుల బొమ్మలు, గణితం, సైన్స్, దేశభక్తుల చరిత్ర, స్పోకెన్ ఇంగ్లీష్ తదితర పుస్తకాలను అందుబాటులోకి తెచ్చారు. ఒక్కో తరగతి విద్యార్థులకు వారంలో రెండు రోజులు గ్రంథాలయంలో గంట పాటు పుస్తక పఠనానికి సమయం కేటాయించారు. ఎవరైనా పుస్తకాలను ఇంటికి అడిగితే రిజిస్టర్లో విద్యార్థుల వివరాలు నమోదు చేసి ఇచ్చే సౌకర్యం కల్పించారు.

గ్రంథాలయాలు పాఠశాలలకు పరిమితం కాకుండా బయట కూడా ఏర్పాటు కావాలి. సాధారణ విద్యార్థులకే పరిమితం కాకుండా ఆటిజంతో బాధపడుతున్న చిన్నారుల కోసం గుజరాత్‌లోని వడోదరలో ఓ స్వచ్ఛంద సంస్థవారు ఓ గ్రంథాలయంను నిర్వహిస్తున్నారు. ఇందులో పుస్తకాలు, వేల సంఖ్యలో ఫ్లాష్ కార్డులు, పిక్చర్ కార్డులు అందుబాటులో ఉంచారు. ఇవి ఆటిజం పిల్లలు తేలికగా చదువుకునేలా ఉంటాయి. మరో విశేషం ఏంటంటే, ఈ గ్రంథాలయ నిర్వహణ బాధ్యతలు ఆటిజం పిల్లలే చూసుకుంటున్నారు. ఇక మొబైల్ ఫోన్లకు అతుక్కుపోతున్న పిల్లల దృష్టిని మరల్చడానికి మణిపూర్‌కు చెందిన దంపతులు చిరు ప్రయత్నం చేసి విజయం సాధించారు. ఓ ఇంటిని అద్దెకు తీసుకొని 'మిరాకిల్ వర్ష్యామ్'ను ప్రారంభించారు. ఇందులో కథల పుస్తకాలతోపాటు ఎన్సైక్లోపిడియా, డిక్షనరీలు, కంప్యూటర్ సైన్స్, మానవ సంబంధాలు, చరిత్ర, సంగీతం, సాహిత్యం, మల్టీ మీడియా వంటి పలు అంశాలకు సంబంధించిన పుస్తకాలతో పాటు పలువురు ప్రముఖుల బయోగ్రఫీలను ఇందులో ఉంచారు. అలాగే ఢిల్లీలో 'బి.సి.రాయ్ చిల్డ్రన్స్ రీడింగ్ రూమ్ అండ్ లైబ్రరీ' పేరుతో ఏర్పాటు చేసిన అతిపెద్ద గ్రంథాలయం ఇది. 1967 నవంబరు 12న అప్పటి రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ దీన్ని ప్రారంభించారు. ఇందులో 40 వేలకు పైగా వివిధ భాషల పుస్తకాలున్నాయి. చిన్నారుల్లో విజ్ఞానాన్ని, దేశభక్తిని, సామాజిక అవగాహనను పెంచేందుకు తోడ్పడుతోంది. ఇలాంటి గ్రంథాలయాలు దేశవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చినప్పుడు పిల్లల అభిరుచి మారి భవిష్యత్తుకు పటిష్ట పునాది పడుతుంది.

**- కోడం పవన్ కుమార్**
9848992825

# అప్పుల పునాదులపై ఆశల సౌధం..



సొంతిల్లు...ప్రతి సామాన్యుడి జీవితంలో అతిపెద్ద కల. కానీ ఆ గూడు కట్టుకునే క్రమంలో మధ్యతరగతి ప్రజలు తమ బతుకుల్ని, పిల్లల భవిష్యత్తును ఎలా తాకట్టు పెడుతున్నారన్నది ఇప్పుడు తీవ్ర ఆందోళన కలిగిస్తున్న అంశం. 'అందరికీ సొంతిల్లు', 'సులభమైన వాయిదాలు' అంటూ ఊరిస్తున్న ప్రకటనల వెనుక..రక్తం పీల్చుతున్న వాస్తవ పరిస్థితులు మన కళ్ళ ముందే కదలాడుతున్నాయి. ఒకప్పుడు రిటైర్మెంట్ వయసుకు దగ్గర పడుతున్నప్పుడు మాత్రమే సొంతింటి గురించి ఆలోచించేవారు. నేటి కార్పొరేట్ కల్చర్, బ్యాంకులు ఇస్తున్న భారీ రుణాలు, సమాజంలో పెరుగుతున్న పోటీ తత్వం యువతను పాతికేళ్లకే ఇంటి రుణాల వైపు నెడుతున్నాయి. స్తోమతకు మించి భవిష్యత్తులో రాబోయే జీతాన్ని ముందే లెక్కలేసుకుని లక్షలకు లక్షలు అప్పులు చేస్తున్నారు. నెల ఒకటో తేదీ రాగానే భయం వేస్తోంది. నా జీతం 60 వేలు, అందులో 40 వేలు ఈఎంఐకే పోతోంది. మిగిలిన 20 వేలతో ఇంటి అద్దె, రేషన్, పిల్లల ఫీజులు ఎలా కట్టాలో అర్థం కావడం లేదు అంటూ సగటు ఓ ప్రైవేట్ ఉద్యోగి కన్నీటి పర్యంతమవడం వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతున్నాయి.

నెలసరి వాయిదాలు చెల్లింపుల కోసం మధ్యతరగతి కుటుంబాలు తమ ప్రాథమిక అవసరాలను సైతం త్యాగం చేస్తున్నాయి. చిన్న చిన్న కోరికలను చంపుకుంటున్నాయి. విద్యతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని భావించే క్రమంలో పిల్లలను నాణ్యమైన విద్యకు దూరం చేస్తున్నాయి. నెలవారీ వాయిదాల భయంతో పిల్లలను మంచి స్కూళ్లలో చదివించలేక సాధారణ పాఠశాలలకు మారుస్తున్న తల్లిదండ్రులు ఎందరో. అప్పులు తీర్చలేని క్రమంలో ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించాల్సిన దుస్థితి బడుగు జీవులది.

సాధారణంగా మధ్యతరగతి వారి ఆదాయం పరిమితంగా ఉంటుంది. బ్యాంకులోను తీసుకుని ఇల్లు కొన్నప్పుడు, ఆ ఆదాయంలో సగానికి పైగా నెలసరి వాయిదాలకే సరిపోతుంది. ఏళ్లు గడుస్తున్నా జీతాలు పెరిగే వేగం కంటే ఖర్చులు పెరిగే వేగం ఎన్నో రెట్లు ఎక్కువగా ఉండటం వల్ల నెలాఖరు వచ్చేసరికి జేబులు ఖాళీ అవుతున్నాయి. అనుకోని వైద్య ఖర్చులు



రావడం, ఉద్యోగంలో ఒడిదుడుకులు ఎదురవడం, ఆర్థిక మాంద్యం వంటి పరిస్థితులు సగటు పేద, మధ్యతరగతి జీవిని మరింత కృంగదీస్తున్నాయి. ఇలాంటి చిన్న కుదుపు వచ్చినా సరే వారి ఆర్థిక ప్రణాళిక పేకమేడలా కూలిపోతోంది.

ఒకపక్క ఇంటి ఈఎంఐ కట్టడానికి, మరోపక్క ఆ నెల గడవడానికి మధ్యతరగతి ప్రజలు క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణాలు, అధిక వడ్డీలకు బయట అప్పులు చేయడం ప్రారంభిస్తారు. ఇది ఒక ప్రమాదకరమైన విషవలయం లాంటిది. ఒక అప్పు తీర్చడానికి మరో అప్పు చేయడం. వడ్డీల మీద వడ్డీలు పెరిగిపోయి అసలు కంటే వడ్డీలే భారం కావడం వంటి పరిణామాలు బలవన్మరణాలకు ఉసిగొలుపుతున్నాయి. మరో మార్గం కానరాక ఆత్మహత్యలే శరణ్యం అనుకునే పరిస్థితికి దారితీస్తున్నాయి. ఈ చక్రంలో చిక్కుకుని నిత్యం అప్పుల వాళ్ల వేధింపులు తట్టుకోలేక, పరువుపోతుందన్న భయంతో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. కరోనా తర్వాత పరిస్థితులు మరింత దారుణంగా మారాయి. ఉద్యోగాలు కోల్పోయిన వారు, వ్యాపారాల్లో నష్టపోయిన వారు ఈఎంఐలు కట్టలేక నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. రికవరీ ఏజెంట్ల వేధింపులు తాళలేక పోతున్నారు. ఒక్క నెల వాయిదా దాటితే చాలు.. బ్యాంకుల నుంచి వరుస ఫోన్ కాల్స్. రెండు నెలలు దాటితే ఇంటి ముందుకు రికవరీ ఏజెంట్లు. పరువు పోతుందనే భయంతో, ఆ క్షణానికి గట్టెక్కడానికి అప్పుల మీద అప్పులు, క్రెడిట్ కార్డుల మీద నగదు విత్ డ్రాలు చేస్తూ ఊబిలో కూరుకుపోతున్నారు. ఎప్పుడూ ఒకటే టెన్షన్.. ఏ క్షణాన ఉద్యోగం పోతుందో, ఏ క్షణాన బ్యాంకు నుంచి నోటీసు వస్తుందోనని! ఒక ఇల్లు కొనడం అంటే నాలుగు గోడలు కొనడం కాదు, భద్రతను కొనుక్కోవడం. కానీ ఆ భద్రత పేరుతో జీవితాంతం అభద్రతా భావంతో బతకాల్సి రావడం దారుణమైంది మరొకటి లేదు. 'సొంతిలు' అనే సామాజిక హోదా కోసం, ఏమాత్రం ఆర్థిక ప్రణాళిక లేకుండా వేసే అడుగులు.. జీవితాన్ని అంధకారంలోకి నెట్టేస్తాయని చెప్పడానికి అనేకమంది పేద మధ్యతరగతి జీవుల గాథలే సజీవ సాక్ష్యం. ఇల్లు కొనాలనుకునే ముందు మన స్తోమత ఏంటి? అత్యవసర పరిస్థితులు వస్తే తట్టుకునే ప్రత్యామ్నాయం ఉందా? అని ప్రతి ఒక్కరూ తమను తాము ప్రశ్నించుకోవాల్సిన సమయం ఇది. ఉద్యోగ భద్రత లేకపోవడం, జీతాలు పెరగకపోవడం, అనారోగ్య సమస్యలు, పిల్లల చదువులు, కుటుంబ అవసరాలు వంటి కారణాలతో మధ్యతరగతి కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఒకవైపు ఇంటి రుణ ఈఎంఐలు, మరోవైపు పిల్లల విద్యా ఖర్చులు, వైద్య ఖర్చులు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల కుటుంబ బడ్జెట్ను కుదేలు చేస్తున్నాయి. చాలా కుటుంబాలు ఇతర అవసరాలను వాయిదా వేసుకుంటూ, తమ కోరికలను త్యాగం చేస్తూ ఈఎంఐలు చెల్లించేందుకు ప్రయత్నిస్తున్నాయి. కొందరు అదనపు ఉద్యోగాలు చేయడం, వ్యక్తిగత రుణాలు తీసుకోవడం వంటి మార్గాలను ఆశ్రయిస్తున్నారు. అయితే పరిస్థితులు మరింత క్లిష్టంగా మారినప్పుడు ఈఎంఐలు చెల్లించడం కష్టసాధ్యమవుతోంది. కొన్ని సందర్భాల్లో ఇళ్లను వేలంవేసే పరిస్థితులు కూడా తలెత్తుతున్నాయి. దీంతో సొంతింటి కల ఆనందాన్ని ఇవ్వాల్సిన చోట ఆందోళనలకు కారణమవుతోంది. సొంత ఇల్లు అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక అందమైన భావోద్వేగం, కానీ అది మన రోజువారీ ప్రశాంతతను హరించేదిగా మారకూడదు. తమ ఆదాయం, భవిష్యత్ అవసరాలను కచ్చితంగా అంచనా వేసుకుని మాత్రమే ఇంటి బడ్జెట్ ప్లాన్ చేసుకోవాలి. కనీసం ఆరు నెలల ఈఎంఐలు, ఇంటి ఖర్చులకు సరిపడా డబ్బును అత్యవసర నిధిగా పక్కన పెట్టిన తర్వాతే ఇంటి లోన్ కు వెళ్లడం సురక్షితం. అదే సందర్భంలో కలలు కనడం తప్పు కాదు, కానీ ఆ కలల సాకారం మన వర్తమానాన్ని, భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేదిగా ఉండకూడదు. అప్పుల ఊబిలోకిపోకుండా, వాస్తవిక ఆర్థిక ప్రణాళికతో అడుగులు వేసినప్పుడే 'సొంతింటి కల' నెరవేరుతుంది.

**- నీలేష్**
8341399599

- 3వ అతి పెద్ద ఆర్థిక అభివృద్ధి దేశం గా వృద్ధి చెందే అవకాశం
- చైనా, జపాన్, ఇజ్రాయెల్ దేశాలను ఆదర్శంగా తీసుకోవాలి

# రూపాయి విలువ పెంపు కోసం తక్షణమే క్రింది సంస్కరణ లు చేపట్టాలి

**పాలకొల్లు, జూన్ 23,మనం ప్రతినిధి** భారతదేశంలో రూపాయి విలువ నానాటికి క్షీణిస్తుండడంతో సర్వత్ర ఆందోళన నెలకొంది. ఆర్థిక సంక్షోభం ఏర్పడి కరువు కాటకాలు, ఏర్పడతాయని భయం ఆర్థిక నిపుణులులో ఆందోళన నెలకొన్నట్లు తెలుస్తోంది. ఏ రాష్ట్రం చూసినా రూ.లక్షల కోట్లలో అప్పులు, ఇక భారతదేశం ఈ అప్పులు తీర్చే పరిస్థితి కనిపించని దుస్థితి.దీనికి కారణం స్వయం అభివృద్ధి సాధించకుండా ఇతర దేశాలపై ఆధారపడడమే. దీనికి మరో ప్రధాన కారణం మన దేశ మేధావులు అంతా అమెరికా వంటి ఇతర దేశాలు వలస వెళ్లి పోవడమే అని ఆర్థిక నిపుణులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. మన దేశంలో పుట్టి పెరిగి, విద్యను అభ్యసించి, మేధావిగా తయారీఅయ్యి, అనంతరం మనదేశంలో ఆ మేధావితనాన్ని వినియోగించకుండా డాలర్లు సంపాదించి పెట్టే అమెరికా వంటి విదేశాలు వలస వెళ్లిపోవడమేనని ఆర్థిక నిపుణులు భావిస్తున్నట్లు తెలియ వచ్చింది. ఇది కాస్త రూపాయి పతనం, డాలర్ల పెరుగుదల వరకు చేరిందని అంటున్నారు. ఒక అమెరికన్ డాలర్ కు మన రూపాయి విలువ దాదాపు 95 రూపాయలకు పడిపోయింది అంటే దీని ప్రధాన కారణం మన దేశం మేధావులు ఇతర దేశాలకు వెళ్లి ఆ దేశాలను అభివృద్ధి చేయడమేనని అంటున్నారు. దీనివల్ల గత ఏడు దశాబ్దాల నుంచి నుంచి ఇదే జరగడంతో మన వాళ్ళ వల్ల ఇతర దేశాలు అభివృద్ధి చెందినవి తప్ప మన దేశం అభివృద్ధి అలాగే ఉండిపోయింది. దీనికి కారణం స్వాతంత్ర్యమ్ వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత చర్యలే అని పలువురు విమర్శిస్తున్నారు. ఏ దేశ నిపుణులు ఆ దేశంలోనే అభివృద్ధికి పాటు పడాలని, ఇతర దేశాల అభివృద్ధికి తోడ్పడకూడదు అని నిబంధనలు పెట్టి ఉంటే ఈపాటికి మన దేశం అభివృద్ధిలో మొదటి స్థానంలో ఉండేదేమోనని మరికొందరు అంటున్నారు. రూపాయి విలువ పెంచడం, దేశాన్ని 3వ అతి పెద్ద ఆర్థిక అభివృద్ధి దేశం గా తీర్చి దిద్దాలంటే క్రింది మార్పులు తీసుకు రావాల్సి వుంది అని ఆర్థిక నిపునులు సూచిస్తున్నారు.జాతీయ భాష హిందీ ప్రాధాన్యత పెంచి , చైనా, జపాన్ లను ఆదర్శంగా తీసుకోవాలి:: బ్రిటిష్ వారు భారతదేశం రాక మన దేశాన్ని 150 సం.కు పై బడి పాలించడం కారణంగా భారతదేశంలో ఆంగ్ల భాష సులువుగా నేర్చుకున్నారు. ఈ కారణంగా స్వాతంత్రియం అనంతరం మన దేశ మేధావులు యూఎస్ వంటి ఇతర దేశాలు వెళ్లి డాలర్ల సంపాదించడం కోసం అలవాటు పడిపోయారు. మేధావులు అయిన ఇంజనీర్లు,డాక్టర్లు, ప్రొఫెసర్లు, సైంటిస్టులు అందరూ కూడా డాలర్ల సంపాదనకు ఎగబడి భారతదేశ అభివృద్ధిని కుంటుపరిచారు. అదే గనుక చైనా, జపాన్ దేశంలు చూసుకుంటే వారికి బ్రిటిష్ వారి పాలన లేకపోవడంతో ఇంగ్లీషు భాష ప్రాచీన కాలం నుంచి కూడా చైనా,జపాన్ వారికి తెలియకపోవడంతో విదేశాలు వెళ్లకుండా వారి సొంత భాషలోనే దేశాలన్ని అభివృద్ధి చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. దీంతో ఈ కారణాలే మనం బేరీజు వేసుకుంటే అభివృద్ధిలో చైనా, జపాన్ ఎంత ఎత్తుకు ఎదిగిపోయిందో అవగతం అవుతుంది.దీంతో మన మేధావులు వల్ల ఆ దేశాలు ఎగుమతులు చేసే స్థాయి కి, మన దేశం దిగుమతి దేశంగా మారాయి.అందువల్ల ఇప్పటికైనా ప్రధానమంత్రి మోడీ చొరవ తీసుకుని యుద్ధ ప్రాతిపదికన ఆంగ్ల భాష ప్రధాన్యత తగ్గించి జాతీయ భాష హిందీ ప్రాధాన్యత పెంచాలి , చైనా, జపాన్ దేశాలన్ని ఆదర్శంగా తీసుకుని ఆ విధంగా భారతదేశ మేధావులు ఏ దేశం వెళ్లకుండా భారతదేశంలో ఉండేలా పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని భారతదేశం ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు కూడా భావిస్తున్నట్లు తెలుస్తోంది.దీనివల్ల అన్ని ఉత్పత్తులు ఇక్కడే జరిగి, దిగుమతులు తగ్గి మన దేశ ఉత్పత్తులు ఎగుమతులు పెరిగి రూపాయి విలువ పెరుగుతుంది. వలస మేధావుల జీతాల నుంచి 50శాతం రికవరీ చేయాలి:: భారతదేశంలో పుట్టి, భారతదేశంలో గాలి పీల్చి పెరిగి,విద్యను అభ్యసించి మేధావులుగా మారిన ఇంజనీర్లు,డాక్టర్లు, ప్రొఫెసర్లు, సైంటిస్టులు తన పనితనాన్ని వినియోగించి భారతదేశ అభివృద్ధికే పాటుపడాలని యుద్ధ ప్రాతిపదికన ప్రధానమంత్రి మోడీ చర్యలు తీసుకోవాలని ఆర్థిక మేధావులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికోసం ప్రత్యేక కేంద్ర ప్రభుత్వ జీవోలు తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. ఒకవేళ అందుకు నిరాకరించిన మేధావులు. ఈ విధానం ఎవరైనా ఉంటే వారి జీతాల నుంచి 2027నుంచి వెళ్లే వారి నుండి 50% పైబడి జీతాని భారతదేశానికి చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అదేవిధంగా పెద్ద వాణిజ్యవేత్తలను కూడా పెట్టుబడులు భారతదేశంలో పెట్టాలనే నిబంధనలు కూడా తీసుకురావాలని పలువురు ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఈ చర్యల వల్ల భారతదేశం ఇక నైనా ఆర్థిక అభివృద్ధి చెందడ మే కాకుండా రూపాయి విలువ బాగా పెరుగుతుందని పలువురు అంటున్నారు. ఇజ్రాయిల్ మాదిరిగా యువత శక్తిని వినియోగించుకోవాలి:: ఇజ్రాయిల్ దేశం మాదిరిగా యువశక్తిని సైన్యం వంటి ప్రధాన కేంద్ర ప్రభుత్వ సేవల్లో వినియోగించుకోవాలని పలువురు మేధావులు సూచిస్తున్నారు. ప్రస్తుతం భారతదేశంలో 50 శాతం పైబడి యువత అంతా సెల్ఫోన్లపై సోషల్ మీడియా ను వ్యసనంగా చేసేసుకుంటున్నారని దీనివల్ల భారతదేశంలో యువశక్తి నిరుపయోగం అయిపోతుందని అంటున్నారు. కాళీ గా కూర్చుని మొబైల్ చూస్తు శ్రమ వృధా చేసే యువత ను కూడా వినియోగించు కోవాలి అని మరి కొందరు సూచిస్తున్నారు. ఇజ్రాయిల్ లో ప్రతి ఒక్కరూ మాటలు తక్కువ తెల్లవారితే ఎవరి పని వాళ్లు చేసుకుంటూ శ్రమ ఎక్కువ పడడం, ప్రతి ఒక్కరు 10సం. లు ఆర్మీ లో విధి గా పని చేయడం,వ్యవసాయ, ఫ్యాక్టరీ ఉత్పత్తులు అధికంగా వచ్చి దేశ అభివృద్ధి జరుగుతుందని అందువల్ల ఒక ప్రక్క చైనా దేశాన్ని మరోపక్క ఇజ్రాయిల్ దేశంను ఆదర్శంగా తీసుకుని ప్రధానమంత్రి మోడీ యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని తద్వారా రూపాయి విలువను పెంచాలని దేశ మేధావులు, ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు ప్రజలు కోరుతున్నారు.అదే విదంగా ఇతర దేశాల్లకు ప్రకృతి విపరీత్యాల సమయాల్లో తప్ప అన్ని సహాయకాలను నిలిపి వేయాలి అనికూడా ఆర్థికనిపుణులు కోరుతున్నారు. ఉచిత పథకాలు రద్దు చేయాలి,సుప్రీం కోర్టు చొరవ తీసుకోవాలి: దేశం లో విద్య, వైద్యం, పింఛన్లు, రేషన్, ఇళ్ళు తప్పు అన్ని ఉచిత పథకాలు ను రద్దు చేసేలా సుప్రీం కోర్ట్ చర్యలు తీసుకోవాలి అని ప్రజలు కోరుతున్నారు.60 ఏళ్ళు దాటనిఏ కులస్థులు కు పింఛనులు ఇవ్వక్కుడదు.ఓట్ల లబ్ది పొందే ఏ రాజకీయ పార్టీ ఈ పనిచేయడం కష్టం కనుక కోర్టు లే రంగం లోకి దిగి దేశాన్ని రక్సించాలని కోరుతున్నారు.ఎమ్మెల్యే, ఎంపీ ల డబల్ పింఛన్లు రద్దు చేసి,జీతాలు తగ్గించాలని, వారి రాయితీలు తగ్గించాలని కోరుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కంటే ప్రైవేట్ ఉద్యోగాలు పెంచాలి :: అధిక వ్యయం కల్గించే ప్రభుత్వ ఉద్యోగాలు కంటే ఉత్పత్తులు, ఎగుమతులు పెంచే ప్రైవేట్ ఉద్యోగాలు అధికం గా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచాలి ప్రపంచ దేశాలు మెచ్చే విధంగా క్వాలిటీ ఉత్పత్తులు పెంచాలి. యువత లో నేను, నాదేశం పేరుతో సేవలాందించాలి : భారత దేశం లోని యువత లో విదేశాల్లో ని డాలర్స్ కోసం కాకుండా నాదేశాభివృద్ధె నాకు ముఖ్యం అనే ఇంట్రస్ట్ పెంచుకోవాలి అని మేధావి వర్గం సూచిస్తోంది.అదే విధంగా ప్రతి ఎన్నికల ప్రక్రియ కోసం వ్యయం చేసే రూ. 7లక్షల కోట్లు దేశానికి భారం తగ్గించేందుకు జమిలి ఎన్నికలు నిర్వాహ్యించాలని కూడా కోరు తున్నారు.అని తెల్సింది. కావున భారత దేశం రూపాయి విలువ పెంచి, డాలర్ విలువ తగ్గించచి, 3వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ గా మారడం కోసం విధంగా పైన పేర్కొన్న సంస్కరణలు యుద్ధ ప్రాతిపదిక న పీఎం మోడీ చర్యలు చేపట్టాలని మేధావి వర్గం,ఆర్థిక నిపుణులు, దేశ ప్రజలు కోరుతున్నారు.

# ఎచ్చెర్లకు జ్యోతిరావు పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాల

## 37 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వ ఆమోదం



**ఎచ్చెర్ల,నిమ్మాడ, జూన్ 23 మనం న్యూస్ :** ఎచ్చెర్ల నియోజకవర్గంలోని వెనుకబడిన తరగతుల బాలికలకు నాణ్యమైన గురుకుల విద్య అందించాలనే సంకల్పంతో రాష్ట్ర వ్యవసాయ, సహకార, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేసిన నిరంతర కృషి ఫలించింది. మంత్రి ప్రత్యేక చొరవతో ఎచ్చెర్లకు మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది.గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద, మధ్యతరగతి కుటుంబాల బాలికలకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో మంత్రి అచ్చెన్నాయుడు పలుమార్లు ప్రభుత్వ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో గురుకుల విద్యాసంస్థ అవసరాన్ని సమగ్రంగా వివరించి ప్రభుత్వం నుంచి అనుమతులు సాధించడంలో కీలక పాత్ర పోషించారు. నూతనంగా మంజూరైన ఈ గురుకుల బాలికల పాఠశాల నిర్వహణ కోసం వివిధ విభాగాల్లో మొత్తం 37 పోస్టుల భర్తీకి కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో విద్యార్థినులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన వసతి, శిక్షణా సౌకర్యాలు అందనున్నాయి.ఎచ్చెర్లకు గురుకుల పాఠశాల మంజూరు కావడం నియోజకవర్గ విద్యా రంగ అభివృద్ధిలో ఒక మైలురాయిగా స్థానిక ప్రజలు అభివర్ణిస్తున్నారు. ముఖ్యంగా బీసీ బాలికలకు ఉచితంగా నాణ్యమైన విద్య అందించే అవకాశం కల్పించిన మంత్రి అచ్చెన్నాయుడు కృషిని ప్రజలు, బీసీ సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందిస్తున్నారు.ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కూడా మంత్రి అచ్చెన్నాయుడు చేసిన కృషిని కొనియాడుతూ, ఎచ్చెర్ల విద్యాభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరింత మంది పేద విద్యార్థినులు గురుకుల విద్య ద్వారా ఉన్నత లక్ష్యాలను చేరుకునే అవకాశం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# నియోజకవర్గ 14 కీలక సమస్యలపై పిటిషన్స్ కమిటీ ముందు గళమెత్తిన పల్లా



- **రెవెన్యూ, ఏపీఐఐసీ, పట్టణాభివృద్ధి శాఖలకు సంబంధించిన పెండింగ్ సమస్యలకు రెండు నెలల్లో పరిష్కారం చూపిస్తామని కమిటీ హామీ**
- **టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు**

**విశాఖపట్నం, జూన్ 23 మనం న్యూస్ :** కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ స్పీకర్, శాసనసభ పిటిషన్స్ కమిటీ ఛైర్మన్ కనుమూరు రఘురామకృష్ణంరాజు అధ్యక్షతన నిర్వహించిన పిటిషన్స్ కమిటీ సమావేశంలో గాజువాక నియోజకవర్గంలో సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న పలు ప్రజా సమస్యలను టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సమగ్రంగా ప్రస్తావించారు. భూ సేకరణ బాధితుల పరిహారం, నిర్వాసితుల పునరావాసం, 22-ఏ సమస్యలు, పరిశ్రమల వల్ల ప్రభావితమైన కుటుంబాల హక్కులు, భూ క్రమబద్ధీకరణ, మత్స్యకారుల జీవనోపాధి, ఉక్కు నిర్వాసితుల సమస్యలు, గ్రామసభ తీర్మానాల అమలు తదితర అంశాలను కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. గాజువాక ప్రజలు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న సమస్యలను శాఖల వారీగా వివరించిన పల్లా, ప్రతి అంశానికి నిర్దిష్ట గడువులతో పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. దశాబ్దాలుగా నివసిస్తున్న కుటుంబాలకు భరోసా కల్పించాలి చినగంట్యాడలోని కుంచమాంబ కాలనీ, కూర్మన్నపాలెంలోని రాసలమ్మ కాలనీ, మిందీలోని గుడివాడ అప్పన్న కాలనీ, వడ్లపూడిలోని సిద్ధార్థనగర్ ప్రాంతాల్లో వందలాది కుటుంబాలు దశాబ్దాలుగా నివసిస్తున్నప్పటికీ నీటి వనరుల భూముల పేరుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పల్లా కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే ఉన్న ఇళ్లకు జీవో-30 తరహాలో క్రమబద్ధీకరణ కల్పించి, రిజిస్ట్రేషన్లు, భవన అనుమతులు, పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ప్రధాన కార్యదర్శికి ప్రత్యేక సిఫార్సులు పంపాలని, అవసరమైతే కేబినెట్ ఆమోదంతో ప్రత్యేక విధానం తీసుకురావాలని సూచించారు. దీనిపై పిటిషన్స్ కమిటీ సానుకూలంగా స్పందించి 90 రోజుల్లో కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఫార్మాసిటీ నిర్వాసితులందరికీ పునరావాసం కల్పించాలి ఎదురువానిపాలెం, కొత్తపాలెం, లెమర్తి అగ్రహారం ప్రాంతాలకు చెందిన అర్హులైన కుటుంబాలకు ఇప్పటికీ ఇళ్ల స్థలాలు కేటాయించలేదని పల్లా తెలిపారు. అర్హులైన ప్రతి నిర్వాసిత కుటుంబానికి పునరావాస హక్కు కల్పించాలని కోరారు. రెండు నెలల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి మిగిలిన లబ్ధిదారులకు స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కమిటీ సూచించింది. 22-ఏలో చిక్కుకుని విలవిలలాడుతున్న కాలనీలు వడ్లపూడి, చినగంట్యాడ, కూర్మన్నపాలెం, మిందీ, పెద్దగంట్యాడ, జగ్గరాజుపేట ప్రాంతాల్లోని నివాస కాలనీలు 22-ఏ జాబితాలో ఉండటంతో ప్రజలు కొనుగోలు, విక్రయాలు, రుణాల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పల్లా వివరించారు. వడ్లపూడిలోని శ్రీ నిలయం అపార్ట్మెంట్ సహా పలు కాలనీల సమస్యలను ప్రస్తావిస్తూ అర్హమైన నివాస ప్రాంతాలను 22-ఏ నుంచి తొలగించాలని కోరారు. గ్రామాల వారీగా పరిశీలించి నివేదిక సమర్పించాలని కమిటీ అధికారులను ఆదేశించింది.న ్‌కిలీ ఆర్-కార్డుల వల్ల అసలైన నిర్వాసితులకు నష్టం ఉక్కు నిర్వాసితుల ఆర్-కార్డుల డిజిటలైజేషన్ సమయంలో నకిలీ కార్డులు చొరబడినట్లు వచ్చిన ఫిర్యాదులను పల్లా కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్య పరిష్కారానికి రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి, సంబంధిత ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన పిటిషన్స్ కమిటీ, అనుమానాస్పదంగా ఉన్న 486 డౌట్ఫుల్ ఆర్-కార్డుల వ్యవహారాన్ని సమగ్రంగా పరిశీలించి, అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది.

# పరవాడ ఫార్మాసిటీలో అగ్ని ప్రమాదం

## ఇరువురు కార్మికులు మృతి



**అనకాపల్లి పరవాడ జూన్ 23 మనం న్యూస్:** అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఇక్కడి దక్షిణ ఎనర్జీ కెమికల్ కర్మాగారంలో మంటలు చెలరేగడంతో అక్కడే ఉన్న ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరు ప్రమాదంలో చిక్కుకున్నట్లు తెలుస్తోంది.ఫార్మసిటీలో మరో పరిశ్రమలో ప్రమాదం, అచ్యుతాపురం గోవాడ గ్రామాలకు చెందిన ఇద్దరు కార్మికులు వెంకటేష్ ,త్రినాధులు మృతి చెందినట్లు తెలిసింది.పరవాడ ఫార్మసిటీలో అగ్నిప్రమాదం పై స్పందించిన హోం మంత్రి అనిత. అనకాపల్లి జిల్లా కలెక్టర్,ఎస్పీలతో ఫోన్లో మాట్లాడి ప్రమాదంపై ఆరా తీశారు.అగ్ని ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన హోం మంత్రి అనిత.సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది.. హోం మంత్రి అనిత స్పష్టం చేశారు.

# పాఠశాలల సంసిద్ధత, విద్యార్థుల ఆరోగ్యంనాణ్యమైన విద్యా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి

- **పాఠశాలల పునఃప్రారంభ సంసిద్ధత పై అధికారుల సమీక్ష**
- **ఐ టి డి ఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ**



**అల్లూరి జిల్లా పాడేరు, జూన్ : 23 మనం న్యూస్ :** జిల్లాలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో పాఠశాలల సంసిద్ధత విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, విద్యా ప్రమాణాల మెరుగుదలపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు గురుకులం ప్రిన్సిపల్స్, ఏటిడబ్ల్యూఎస్ తో సమీక్ష సమావేశం నిర్వహించిన ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ. గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు తో కలసి ఐటిడిఏ సమావేశం మందిరంలో మంగళవారం ఉదయం విద్యాశాఖలో మార్పులు, విద్య బోధన, పిల్లలకి అందించవలసిన మెనూ, స్కూల్ క్లీయర్నెస్ అధికారుల పనితీరు ఉన్నతాధికారుల పర్యవేక్షణలపై కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ, ప్రతి పాఠశాలలోనూ విద్యా, వాతావరణం ఉల్లాసంగా ఉండేలా 'స్కూల్ రెడీనెస్ ' కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థుల నమోదును పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.పరిశుభ్రమైన ఆహారం ప్రతిరోజు ఏర్పాటు చేసే భోజనం ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు అందించే ఆహారం అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో, నాణ్యతా ప్రమాణాలతో వండాలని స్పష్టం చేశారు. వంట గదులు, తాగునీటి ట్యాంకులను నిరంతరం శుభ్రపరచాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు పి.బి.కె పరిమళ, ఏ టి డబ్ల్యూ ఓ, వివిధ పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు, గురుకులం ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద ఘటనపై సీఎం విచారం

- **జిల్లా అధికారులతో మాట్లాడిన ముఖ్యమంత్రి**
- **బాధితులను ఆదుకోవాలని సీఎం ఆదేశం**

**అమరావతి, జూన్ 23 మనం న్యూస్ :** అనకాపల్లి జిల్లా పరవాడలోని ఫార్మా సిటీలోని దక్షిణ్ ఎనర్జీలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ఇద్దరు కార్మికుల మృతిపై సీఎం తన సంతాపం తెలియచేశారు. జిల్లా అధికారులతో మాట్లాడి ప్రమాదం జరిగిన తీరుపై సీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఫార్మా సిటీ అగ్నిమాపక కేంద్రం నుంచి రెండు, పరవాడ నుంచి మరొక అగ్ని మాపక శకటాలు చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చాయాని అధికారులు సీఎంకు వివరించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని సూచించారు.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవు



- **సీఐ ఉమాభాయ్**

**కనేకల్ జూన్ 23 మనం న్యూస్:** ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మండల ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ ఇన్స్పెక్టర్ ఉమాబాయి మంగళవారం తన సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో దాడులు నిర్వహించగా కనేకల్ ప్రొహిబిషన్ స్టేషన్ పరిధిలో గల అంబాపురం క్రాస్ వద్ద ఒక వ్యక్తి బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న నేపథ్యంలో ఆ వ్యక్తిని అరెస్టు చేసి అతనిపై పబ్లిక్ కాన్సెప్షన్ కేసు నమోదు చేసినట్టు ఆమె తెలిపారు. ఇందులో భాగంగానే కనేకల్, బొమ్మనహల్ మండలంలో గల 06 అ4 షాప్ లను ఆకస్మికంగా దాడులు నిర్వహించి మద్యం దుకాణాల్లో బ్రాండ్ల వైన్లను పరీక్షించి, క్రయవిక్రయాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి,మద్యం అధిక ధరలకు విక్రయించరాదు, అలాగే బెల్ట్ షాప్ నిర్వాహకులకు మద్యం అమ్మరాదని, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని వారిని హెచ్చరించినట్టు ఆమె తెలిపారు. ఇందులో భాగంగానే కనేకల్ పట్టణం నందు డ్రగ్స్ వద్దు జీవితం వద్దు అనే కార్యక్రమంపై అవగాహన సదస్సును నిర్వహించినట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖా ఎస్సై షెక్షావలి, రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పరవాడ ఫార్మాసిటీలో అగ్నిప్రమాద ఘటనపై అనకాపల్లి ఎంపీ దిగ్భ్రాంతి

- **సహాయక చర్యలు వేగవంతం చేయాలి**
- **క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించిన రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సిఎం రమేష్**



**అనకాపల్లి జూన్ 23 మనం న్యూస్ :** అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని దక్షిణ్ ఎనర్జీ సంస్థలో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం. రమేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందడం అత్యంత బాధాకరమని మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ప్రమాద ఘటనకు సంబంధించిన వివరాలను జిల్లా అధికారుల ద్వారా తెలుసుకుని సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని అధికారులను కోరారు.క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించి అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని సూచించారు.ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించి జిల్లా అధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని, అవసరమైన సహాయ చర్యలు చేపట్టేందుకు సంబంధిత అధికారులతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఫ్రెండ్లీ పోలీస్ సింగ్ వ్యవస్థలో భాగంగా సీజ్ చేసిన వాహనాలు అప్పగింత



**విశాఖపట్నం జూన్ 23 మనం న్యూస్ :** ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థలో భాగంగా సీజ్ చేసిన వాహనాలను ఆయా వాహన యజమానులకు అందించడం జరిగిందనీ విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖ బ్రత బాగ్చి తెలిపారు. ఆయన మీడియాకు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థలో భాగంగా సీజ్ చేసిన వాహనాలను ఆయా వాహన యజమానులకు అంధించాం.వివిధ నేరాల్లో ఇతరత్రా రూపాల్లో సీజ్ చేసిన వాహనాలను సంవత్సరాల తరబడి పోలీస్ స్టేషన్ లోనే ఉన్న వాహనాలపై దృష్టి సారించడం జరిగింది.ఎక్కువ కాలం వాహనాలు అలాగే ఉండిపోతే దెబ్బతినే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.నెలల తరబడి ఉండిపోయిన వాహన యజమానులను గుర్తించడం జరిగింది.గత రెండేళ్ల కాలంగా విశాఖ సిటీ పరిధిలో వెహికల్స్ రిటర్న్ మేళాను చేపడుతున్నాం.ఇప్పటి వరకు ఐదు విడతల్లో యజమానులకు వాహనాలను ఇవ్వడం జరిగింది.మొదటి విడతలో 122 ,రెండవ విడతలో 320 వాహనాలను యజమానులకు అప్పగించాం. మూడు ,నాలుగు, ఐదవ విడతల్లో 1080 వాహనాలకు రిలీజ్ చేశాం. మంగళవారం జరిగిన 6 వ విడతలో అత్యధికంగా 538 ని వాహనాలను అప్పగించడం జరుగుతు ందన్నారు.లా అండ్ ఆర్డర్, క్రైం,ట్రాఫిక్ విభాగాల నుండి సీజ్ చేసిన వాహనాలను రిలీజ్ చేస్తున్నామన్నారు.

# ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయాలి

- **ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేదు**
- **జిల్లా అధికారులతో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్**



**పుట్టపర్తి, జూన్ 23 మనం న్యూస్ :** జిల్లాలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో పలు కీలక అంశాలపై సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందుతున్న అర్జీలను నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని, ఏ ఒక్క ఫిర్యాదు కూడా పెండింగ్లో ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో బయోమెట్రిక్, డిజిటల్ హాజరు వ్యవస్థ ను పకడ్బందీగా అమలు చేయాలని, విధుల్లో అలసత్వాన్ని సహించబోమని హెచ్చరించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అటవీకరణ కార్యక్రమాలను వేగవంతం చేయాలని, డ్వాక్రా మహిళలు, ఉపాధి హామీ కూలీల భాగస్వామ్యంతో నాణ్యమైన విత్తన బంతులను (సీడ్ పెల్లెటైజేషన్) తయారు చేసి కొండ ప్రాంతాలు, ఖాళీ స్థలాల్లో చల్లాలని సూచించారు. అలాగే 'స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహించి గ్రామాలు, పట్టణాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు.

# మడకశిర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



**మడకశిర,జూన్ 23,మనంన్యూస్:** మడకశిర పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పోలీస్ స్టేషన్ ను మంగళవారం ఉమ్మడి అనంతపురము జిల్లా పిఅండ్ఇ ఇంచార్జీ డెప్యూటీ కమిషనర్ డివివి ప్రసాద్ ఆకాస్మికౌగా తనిఖీ చేపట్టారు.ఆయనతో పాటు పుట్టపర్తి ఇ ఎస్ టి ఎఫ్ ఇన్స్పెక్టర్ హరికృష్ణ లు కలసి స్టేషన్ లోని పలు రికార్డులను తనిఖీ చేసారు.ఇప్పటివరకు స్టేషన్ లో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.వివిధ కేసులకు సంబంధించి విచారణను త్వరగా పూర్తి చేయాలని సాధ్యమైనంత త్వరగా న్యాయ స్థానంకు ఛార్జ్ షిట్ దఖలు చేయాల్సిందిగా వారు పలు సూచనలు,సలహాలు నిచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ కర్నాటక మద్యం అక్రమ రవాణా,అమ్మకాలను పూర్తి స్థాయి లో అరికట్టెందుకు కఠిన చర్యలు చేపట్టాల్సిందిగా వారు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సిఐ మురళి కిషోర్,ఎస్ఐలు శంకర్,వెంకటేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



**పుట్టపర్తి, జూన్ 23 మనం న్యూస్:** జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు పుట్టపర్తి పట్టణంలో ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా ఆటో డ్రైవర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పట్టణ సీఐ యువరాజు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన కోరారు. మంగళవారం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో పట్టణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, ప్రజలకు మర్యాదపూర్వక సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ యువరాజు మాట్లాడుతూ, ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తికి దేశ విదేశాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారని, వారికి సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణా సేవలు అందించడం ఆటో డ్రైవర్ల బాధ్యత అని పేర్కొన్నారు. గణేష్ గేట్, గోపురం గేట్ ప్రాంతాల్లో ఆటోలను నిలపరాదని స్పష్టం చేసిన ఆయన, పార్కింగ్కు కేటాయించిన ప్రాంతాల్లోనే వాహనాలను నిలపాలని సూచించారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపివేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు. ప్రతి ఆటోలో క్యూఆర్ కోడ్, డ్రైవర్ వివరాలు, అవసరమైన పత్రాలు తప్పనిసరిగా ఉండాలని, ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. విదేశీ భక్తులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు, సంఘటనలు, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల విక్రయాలు, వినియోగం, అక్రమ రవాణా వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు ఎక్కడైనా గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు.

# మనం చేసిన అభివృద్ధిని ప్రతి ఇంటికీ వెళ్లి వివరిద్దాం



**అనంతపురం, జూన్ 23 మనం న్యూస్ :** రెండేళ్లలో మనం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ఇంటింటికీ వెళ్లి వివరించాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత నియోజకవర్గ టీడీపీ శ్రేణులకు సూచించారు. ఎమ్మెల్యే సునీత ఆదేశాల మేరకు పార్టీ నేతలు రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలన - ఇంటింటి ప్రచారం, ఓటర్ వెరిఫికేషన్ కు సంబంధించి సమావేశం నిర్వహించారు. అనంతపురం నగరంలోని పరిటాల క్యాంప్ కార్యాలయంలో పార్టీ పరిశీలకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల కన్వీనర్లు, క్లస్టర్ ఇంచార్జిలు, ప్రధాన కార్యదర్శులు, ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఇందులో ముఖ్యంగా కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ శ్రేణులంతా మరోసారి ప్రజలకు వద్దకు వెళ్లాలని అధిష్టానం ఆదేశించిందని ముఖ్య నేతలన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఆర్థిక ప్రగతి నివేదికలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ఈ నెల 25 నుంచి ఆగస్టు 10 వరకు 45 రోజులపాటు ఇంటింటికీ వెళ్లాలని.. ఈ ప్రచారంలో ప్రతి ఒక్కరూ పాల్గొంటారన్నారు. దీంతో పాటు ఎస్ఐఆర్ ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఇంటికీ వెళ్లి అవగాహన కల్పించాలని పార్టీ సూచించిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, తప్పులను సరిదిద్దేందుకు, బోగస్ ఓట్ల తొలగింపు కోసం ఇంటింటి ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు ఈ ప్రచార కార్యక్రమంపై మండలాల వారిగా ఒక ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుంటున్నట్టు నేతలు తెలిపారు.

# అన్నవరం స్వామివారికి 1.8 కిలోల వెండి విరాళం

**అన్నవరం, జూన్ 23, మనం న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారికి ఓ భక్తుడు వెండి విరాళాన్ని సమర్పించారు. శ్రీకాకుళం జిల్లా గార మండలం ఎల్లపేట గ్రామానికి చెందిన భక్తుడు మంగళవారం ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కిలో 800 గ్రాముల వెండిని దేవస్థానానికి అందజేశారు. విరాళంగా తీసుకొచ్చిన వెండిని దేవస్థానం కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధర్ రావుకు అప్పగించారు. స్వామివారి సేవలో భాగంగా ఈ వెండిని సమర్పిస్తున్నట్లు భక్తుడు తెలిపారు. దేవస్థానంలో స్వామివారికి ఉపయోగించే వెండి వస్తువుల తయారీలో దీనిని వినియోగించాలని కోరారు. భక్తుడి భక్తిశ్రద్ధలను ఈవో అభినందించారు. దేవస్థానం తరఫున ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. భక్తులు స్వామివారిపై ఉన్న విశ్వాసంతో విరాళాలు అందించడం ఆనందదాయకమని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# ఓటీపీ నిబంధనతో వైసిపి సభ్యత్వ ప్రక్రియకు ఆటంకం

**ఆచంట నియోజకవర్గంలో వైఎస్ఆర్సిపి శ్రేణుల్లో పెరుగుతున్న అసంతృప్తి.**
**కార్యాలయానికి రమ్మంటూ పిలుపు. వెళ్లాక నిరీక్షణ తప్పడం లేదంటున్న కార్యకర్తలు.**
**గ్రామస్థాయిలో సౌలభ్యం కల్పించాలని మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు విజ్ఞప్తులు.**




**పోడూరు జూన్ 23 మనం న్యూస్ :** పశ్చిమగోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గంలో ఇటీవల నిర్వహించిన వైఎస్ఆర్సిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తమ సభ్యత్వాలను నమోదు చేసుకున్నట్లు తెలుస్తోంది. సభ్యత్వాన్ని ధ్రువీకరించి ఫోటోతో కూడిన గుర్తింపు కార్డులు జారీ చేసేందుకు పార్టీ నిబంధనల ప్రకారం ఓటీపీ ఆధారిత విధానాన్ని అమలు చేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.అయితే సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోన్తో కలిసి తూర్పుపాలెంలోని పార్టీ కార్యాలయానికి వచ్చి ఓటీపీ చెప్పిన తర్వాతే గుర్తింపు కార్డు పొందాలని సూచనలు అందినట్లు కార్యకర్తలు పరస్పరం చెప్పుకుంటున్నారని సమాచారం. దూర ప్రాంతాల నుంచి ఎంతో ఆశతో కార్యాలయానికి చేరుకున్నా, అక్కడ ధ్రువీకరణ ప్రక్రియను నిర్వహించే సిబ్బంది అందుబాటులో లేక వేచి చూడాల్సి వస్తోందనే అభిప్రాయాలు నియోజకవర్గ వ్యాప్తంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే సభ్యత్వం కోసం నమోదు సమయంలో శ్రమించాం.ఇప్పుడు ఐడి కార్డు కోసం మరోసారి తిరగాల్సి వస్తోంది అంటూ కొందరు కార్యకర్తలు తమలో తమే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.పార్టీ కోసం గ్రామాల్లో పనిచేసే కార్యకర్తల సమయానికి విలువ ఇవ్వాల్సిన అవసరం ఉందనే భావనలు కూడా వినిపిస్తున్నాయి.ఈ నేపథ్యంలో గ్రామాల వారీగా బాధ్యతలు కేటాయించి, స్థానిక నాయకుల సమన్వయంతో సంబంధిత సభ్యులకు ఫోన్ ద్వారా ఓటీపీ ధ్రువీకరణ చేసి ఐడి కార్డులు జారీ చేస్తే ఇబ్బందులు తగ్గుతాయని కొందరు కార్యకర్తలు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా మరీ ముఖ్యంగా నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు ఈ అంశంపై దృష్టి సారించి కార్యకర్తల ఇబ్బందులను గుర్తించి సభ్యత్వ ప్రక్రియను మరింత సులభతరం చేసే చర్యలు తీసుకోవాలని పార్టీ శ్రేణుల్లో ఆశాభావం వ్యక్తమవుతున్నట్లు సమాచారం.

# పవన్- కాపుల మధ్య చిచ్చుకు వైసీపీ కుట్ర

- **డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ**



**నరసాపురం, జూన్ 23 (మనం న్యూస్) :** గతంలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ను అసెంబ్లీ గేటు కూడా తాకనివ్వనని ప్రగల్భాలు పలికిన జగన్మోహన్ రెడ్డి నేడు అసెంబ్లీకి కూడా రాలేని పరిస్థితితో కర్మ ఎవరిని వదిలిపెట్టదని రుజువైందని వైసిపి నాయకులు దీనిని దృష్టిలో ఉంచుకొని పవన్ కళ్యాణ్ పట్ల ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ (చిన్న) హెచ్చరించారు. ఇటీవల కాకినాడలో వైసీపీలోని కుహనా కాపు నాయకులు పవన్ కళ్యాణ్ కాపులకు అన్యాయం చేశారని మాట్లాడారని కాపులకు పవన్ కళ్యాణ్ చేసిన అన్యాయం ఏంటని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. గత 2019లో పవన్ కళ్యాణ్ కాపు కులానికి చెందిన నాయకుడని వాగిన వైసీపీ నాయకులు నేడు కాపులకు పవన్ కళ్యాణ్ అన్యాయం చేశారని మాట్లాడడం చూస్తే కాపులను పవన్ కళ్యాణ్ కు దూరం చేసే కుట్ర పన్నుతున్నారని అర్థమవుతోందని దీనిని ప్రజలు గ్రహిస్తున్నారని అన్నారు. విజయవాడలో 23 క్రిమినల్ కేసులు ఉన్న సాయికృష్ణ అనే వ్యక్తి చనిపోతే దానికి పవన్ కళ్యాణ్ కారణమని వైసిపి నాయకులు బురద చల్లడం అర్థరహితమని సాయికృష్ణకు పవన్ కళ్యాణ్ కు సంబంధం ఏంటని మురళీకృష్ణ మండిపడ్డారు. గత ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి కాపులకు ఆర్థికంగా, రాజకీయంగా తీవ్ర అన్యాయం చేస్తే మీరు ఎందుకు ప్రశ్నించలేదని, వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు దళితుడైన డ్రైవర్ ను చంపి డోర్ డెలివరీ చేసినప్పుడు ఈ కుహనా కాపు నాయకులందరూ ఏమయ్యారని ఆయన ప్రశ్నించారు. తనకు అన్ని కులాలు, వర్గాలు సమానమని తనపై కాపు కులముద్ర వేయొద్దని కోరిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై కాపు వ్యతిరేక ముద్ర వేసి వారి మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్న వైసీపీ నాయకులకు కాపు సమాజం ముఖ్యంగా కాపు యువత తగిన బుద్ధి చెప్పడం ఖాయమని రానున్న పంచాయితీ, మునిసిపల్ ఎన్నికలలో రాష్ట్రంలోని కాపులు కూటమి ప్రభుత్వానికి అండగా నిలవడం ఖాయమని మురళీకృష్ణ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు మల్లిపూడి దొరబాబు, ఆముదాలవలస రాంబాబు, పెంటపాటి ప్రసాద్, జి. తమ్మాజీ, కె. సురేష్, బి శ్రీనివాస్, మండ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాద బాధితులకు ముదునూరి ఆర్థిక సహాయాలు



**శంఖవరం జూన్, 23 మనం ప్రతినిధి:** ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలుస్తూ, సామాజిక బాధ్యతగా భావిస్తున్న ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణం రాజు మంగళవారం శంఖవరం, ప్రత్తిపాడు మండలాలలో గల గ్రామలలో పర్యటించారు. ఈ సందర్భంగా శంఖవరం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన కొనిశెట్టి చిన్న అప్పారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కాకినాడ లక్ష్మి హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారని తెలిసి అప్పారావు పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రత్తిపాడు మండలం వెంకటనగరం గ్రామానికి చెందిన చెద్దులూరి సుబ్బారావు కుమారుడు అజయ్ ఆరోగ్యం బాలేని కారణంగా కాకినాడ సూర్య గ్లోబల్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న అజయ్ ను పరామర్శించారు. ఇరువురి కుటుంబ సభ్యులతో కొంతసేపు మాట్లాడిన మురళీకృష్ణం రాజు, వైద్యం అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరాలు తెలుసుకుని, వైద్యుల సూచనలను తప్పకుండా పాటించాలని సూచించారు. త్వరితగతిన పూర్తిస్థాయిలో కోలుకుని సాధారణ జీవన విధానంలోకి రావాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ ఎలాంటి అవసరం వచ్చినా తమ సహాయ సహకారాలు అందుబాటులో ఉంటాయని హామీ ఇచ్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒక్కొక్కరికి రూ. 5,000 చొప్పున రూ 10,000 ఆర్థిక సహాయాలు అందించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణం రాజు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడం ప్రతి నాయకుడి బాధ్యత అని పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించడం, వారికి మానసిక ధైర్యం కల్పించడం ద్వారా మరింత ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతూ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తున్నామని తెలిపారు. ఇరువురి కుటుంబ సభ్యులు తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి ప్రత్యేకంగా విచ్చేసిన మురళీకృష్ణం రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన చూపిన ఆప్యాయత, పరామర్శ తమకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి ఆస్పటల్ మేనేజ్మెంట్ రాంబాబు, వెంకటనగరం మాజీ సర్పంచ్ బాబి, గ్రామ వైఎస్ఆర్సిపి నాయకులు ముప్పిడి నూకరాజు, కె. రామకృష్ణ, జాన్, మాదాసు శివ, వెంకట్ నగరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బిఎల్ఎ అనిశెట్టి మణికంఠ, చెద్దులూరి శివ, తదితరులు పాల్గొన్నారు.

# అన్నవరం దేవస్థానం ట్రాన్పోర్ట్ కార్యాలయం శిథిలావస్థ.



**అన్నవరం, జూన్ 23, మనం న్యూస్:** కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం కొండ దిగువన ఉన్న ట్రాన్స్పోర్ట్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనం పైకప్పు స్లాబ్ నుంచి పెచ్చులు ఊడిపడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనన్న భయం ఉద్యోగులను వెంటాడుతోంది.దేవస్థానం రవాణా విభాగానికి సంబంధించిన కీలక కార్యకలాపాలు ఈ కార్యాలయం నుంచే నిర్వహించబడుతున్నాయి. నిత్యం దేవస్థానం బస్సుల రాకపోకలు, డ్రైవర్లు, సిబ్బంది విధుల నిర్వహణ, ఇతర పరిపాలనా పనులు ఇక్కడే జరుగుతుంటాయి. అయితే భవనం పరిస్థితి రోజురోజుకూ అధ్వాన్నంగా మారుతున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. భవనం ప్రమాదకర స్థితిలో ఉందని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోయిందని సిబ్బంది ఆరోపిస్తున్నారు. స్లాబ్ నుంచి పెచ్చులు ఊడిపడే ఘటనలు ఇప్పటికే పలుమార్లు చోటుచేసుకున్నాయని, అదృష్టవశాత్తూ ఎవరూ గాయపడలేదని చెబుతున్నారు. భక్తుల సేవలకు అత్యంత కీలకమైన రవాణా విభాగం కార్యాలయం ఇలాంటి పరిస్థితుల్లో కొనసాగడం పట్ల స్థానికులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం సంభవించే ముందు దేవస్థానం అధికారులు స్పందించి భవనాన్ని పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం దేవస్థానంలో చర్చనీయాంశంగా మారింది.

# దాతృ హృదయంతో సురేష్ కు ఆర్థిక సహాయం అందించిన కొణిదల సత్య



**ఆచంట జూన్ 23 మనం న్యూస్** ఆచంట గ్రామ పరిధిలోని కొత్తూరు సెంటర్ రెండవ వార్డుకు చెందిన బర్రెడ్డి సురేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటికే పరిమితమై చికిత్స పొందుతున్నాడు దీంతో వారి కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులపై స్పందించి న జనసేన పార్టీ నాయకులు కొణిదల సత్యనారాయణ దాతృ హృదయంతో బాధిత కుటుంబానికి తక్షణ సహాయముగా 20000 రూపాయలు నగదు తో పాటు నిత్యావసర సరుకులు అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో సురేష్ కుటుంబానికి ఎలాంటి సమస్య ఎదురైన తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు జవ్వాది బాలాజీ శ్రీనివాస్ నంబూరి విజయ్ కడలి శ్రీను పితాని లక్ష్మణ్ నిమ్మన వీరశేఖర్ జెట్టి వినోద్ లింగోలు రాఘవులు పోలిశెట్టి మణి బాబు బ్రహ్మ బుల్లయ్య దమ్మ వాసు బెల్లంకొండ ఈశ్వర్ పూసల వెంకన్న కూలి శెట్టి సుబ్బు తదితరులు పాల్గొని సురేష్ ను పరామర్శించారు

# అన్నవరం దేవస్థానం విద్యాసంస్థల ఫలితాలపై సమీక్ష



**అన్నవరం, జూన్ 23, మనం న్యూస్ :** అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సత్యదేవ జూనియర్ కళాశాల, సత్యదేవ డిగ్రీ కళాశాలల విద్యార్థుల పరీక్షా ఫలితాలు, ఉత్తీర్ణత శాతం, విద్యా ప్రమాణాలపై దేవస్థానం చైర్మన్ రోహిత్, ఈవో సమీక్ష నిర్వహించారు. మంగళవారం కొండపై ఉన్న చైర్మన్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు హాజరయ్యారు. ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షల ఫలితాల్లో విద్యార్థులు సాధించిన ఉత్తీర్ణత శాతం, ప్రతిభ కనబరిచిన విద్యార్థుల వివరాలను చైర్మన్, ఈవో అడిగి తెలుసుకున్నారు. అలాగే కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల సంఖ్య, వారి అర్హతలు, బోధనా విధానాలు, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై కూడా సమగ్రంగా చర్చించారు. భవిష్యత్తులో ఉత్తీర్ణత శాతాన్ని మరింత పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలపై ప్రిన్సిపాళ్లకు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే దేవస్థానం లక్ష్యమని, విద్యా ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని చైర్మన్ రోహిత్ పేర్కొన్నట్లు సమాచారం. విద్యార్థుల విద్యాభివృద్ధికి అధ్యాపకులు మరింత కృషి చేయాలని, ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించినట్లు తెలిసింది. ఈ సమీక్ష సమావేశంలో కళాశాలల ప్రగతి, విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలు, విద్యా ప్రమాణాల పెంపుపై పలు అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం. దేవస్థానం విద్యాసంస్థలు జిల్లాలో ఆదర్శ విద్యాసంస్థలుగా నిలవాలని అధికారులు ఆకాంక్షించారు.

# తండ్రి అనారోగ్యంతో రాజకీయం చేయడం సరికాదు

- **మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి తీవ్ర ఆగ్రహం**

**శంఖవరం జూన్ 23 మనం ప్రతినిధి :** కాకినాడ మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం ఆరోగ్య పరిస్థితి బాగోలేనప్పుడు ఆయన కుమార్తె బార్లపూడి క్రాంతి రాజకీయాలు చేయడం సమంజసం కాదని మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా లో మంగళ వారం ఆమె స్థానిక మీడియాతో మాట్లాడుతూ క్రాంతి తీరుపై మండిపడ్డారు. తమ నాయకుడు ముద్రగడ పద్మనాభాన్ని గతంలో తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన పార్టీలతో జతకట్టి నప్పుడే. తన కూతురితో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆరంభంలోనే ఆయన మీడియా ముఖంగా స్పష్టం చేశారని శివకుమారి గుర్తుచేశారు. ముద్రగడ ఆరోగ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలోనే బార్లపూడి క్రాంతికి తండ్రి గుర్తుకు




రావడం, మీడియా ముందుకు వచ్చి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేస్తూ విమర్శలు చేయడం వెనుక రాజకీయ దురుద్దేశాలు ఉన్నాయని ఆరోపించారు. ముద్రగడకు వైఎస్ జగన్ అండ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని లక్ష్మీ శివకుమారి స్పష్టం చేశారు. ప్రముఖ వైద్యుల సలహాలు, సూచనలు తీసుకుంటూ ముద్రగడ కుటుంబ సభ్యులకు ఆయన అండగా నిలిచారని, నిరంతరం ముద్రగడ గిరిబాబుతో ఫోన్లో మాట్లాడుతూ ధైర్యం చెబుతున్నారని వెల్లడించారు. ఇలాంటి కూతుళ్లను సినిమాల్లోనే చూశాం. తండ్రి అనారోగ్యాన్ని ఆసరాగా చేసుకుని రాజకీయం చేసే ఇలాంటి కూతుళ్లను సినిమాల్లో తప్ప నిజ జీవితంలో ఇప్పుడే చూస్తున్నామని శివకుమారి ఎద్దేవా చేశారు. కిర్లంపూడి నివాసంలో ముద్రగడ ఆరోగ్యంగా ఉన్నప్పుడు గుర్తుకురాని తండ్రి, ఇప్పుడు అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉన్నప్పుడు మాత్రమే బార్లపూడి క్రాంతికి గుర్తుకు రావడం పరిపాటిగా మారిందని విమర్శించారు.రాజకీయ లబ్ధి కోసం తండ్రి ఆరోగ్యాన్ని వాడుకునే ఇలాంటి చిల్లర పనులను ఇప్పటికైనా మానుకోవాలని మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీ శివకుమారి హితవు పలికారు.

# అంబేద్కర్,బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహాలను ఆవిష్కరణ



**శంఖవరం జూన్ 23 మనం ప్రతినిధి:** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం,శంఖవరం మండలం కత్తిపూడి గ్రామంలో మంగళవారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా పర్యటించారు. గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ భ్రమరాంబికా సమేత శ్రీ మల్లికార్జున స్వామి మరియు శ్రీ గోపాలకృష్ణ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే సత్యప్రభకు రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోళ్లపారం సెంటర్ వద్ద స్వర్గీయ వరుపుల రాజా జ్ఞాపకార్థం వెన్నా శివ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు సొంత నిధులతో నూతనంగా నిర్మించిన డా.బిఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ను ఎమ్మెల్యే సత్యప్రభ ప్రారంభించారు. అలాగే ప్లాజా వద్ద భారత రాజ్యాంగ నిర్మాత డా బి ఆర్ అంబేద్కర్,బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహాలను ఆవిష్కరించి నూతన కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పర్వత సురేష్,నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కీర్తి వెంకట సుభాష్,తుని జోన్ ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ కరణం సుబ్రహ్మణ్యం,కత్తిపూడి సొసైటీ చైర్మన్ గాబు కృష్ణమూర్తి,పోలం చిన్నా,బద్ది రామారావు,ఈగల దేవుళ్లు,కేలంగి జన,పోసిన శ్రీను,మాజీ ఎంపీటీసీలు సాదనాల లక్ష్మిబాబు,కంచిబోయిన శ్రీను,రౌతు శివ,గాబు శివ,జ్యోతుల శివ,కొయ్యా రమణ, అలపు సత్తిబాబు,నందికోళ్ల హరీష్,మిర్యాల మానేశ్వరావు,దేశెట్టి శ్రీను,వల్లభశెట్టి మధు,పెనుపోతుల అబ్బులు తదితర కూటమి నాయకులు,కార్యకర్తలు మరియు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అన్నవరం దేవస్థాన పాలకమండలికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఇద్దరు దాతలు

**అన్నవరం, జూన్ 23, మనం న్యూస్ :**అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఊతమిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పాలకమండలికి ఇద్దరు ప్రముఖ దాతలను ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించింది. దేవస్థాన అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన మట్టే సత్యప్రసాద్, మారెడ్డి సింగారెడ్డిలను ప్రత్యేక ఆహ్వానితులుగా నియమిస్తూ ఈ నెల 22న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే పాలకమండలి రెండు సమావేశాలను నిర్వహించి భక్తుల సౌకర్యాల విస్తరణ, మౌలిక వసతుల అభివృద్ధి, దేవస్థానం ఆధునీకరణ వంటి అంశాలపై చర్చించింది. అనంతరం దేవస్థానం కార్యనిర్వాహణాధికారి చక్రధర్రావు, పరిపాలన విభాగం అధికారుల సమక్షంలో దేవస్థానం రికార్డు పుస్తకంలో సంతకాలు చేసి తమ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా దేవస్థానం అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని, భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించే దిశగా పాలకమండలికి నిర్మాణాత్మక సూచనలు అందిస్తామని ప్రత్యేక ఆహ్వానితులు పేర్కొన్నట్లు సమాచారం. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దేవస్థానాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు పాలకమండలి కృషి చేస్తోందని అధికారులు తెలిపారు. దాతల నియామకంతో దేవస్థానం అభివృద్ధి కార్యక్రమాలకు కొత్త ఊపు వస్తుందని, భక్తుల సేవలో మరింత మెరుగైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఏర్పడుతుందని దేవస్థాన వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు వేగం పెంచాలి

- **కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సమీక్ష**

**పుట్టపర్తి, జూన్ 23 మనం న్యూస్:** శ్రీ సత్యసాయి జిల్లాలో నూతన పారిశ్రామిక పార్కుల ఏర్పాటు, వాటికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పుట్టపర్తి కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో జిల్లాలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటు, భూసేకరణ పనుల పురోగతిని వారు సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి పారిశ్రామిక పార్కుల ఏర్పాటు కీలకమని పేర్కొన్నారు. పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరిగేలా ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని తెలిపారు. చిలమత్తూరు, హిందూపురం, లేపాక్షి, పుట్టపర్తి, మడకశిర మండలాల్లోని వివిధ గ్రామాల్లో ప్రతిపాదించిన పారిశ్రామిక పార్కులకు సంబంధించిన భూసేకరణ పనుల్లో మరింత వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆమోదం పొందిన భూసేకరణ కేసులను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని సూచించారు. భూసేకరణ ప్రక్రియలో సాంకేతిక లేదా ఇతర పెండింగ్ సమస్యలు ఉంటే వాటిని త్వరితగతిన పరిష్కరించి, భూములను ఏపీఐఐసీకి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు పరస్పర సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో ఏపీఐఐసీ అధికారులు, ఆర్డీవోలు, సంబంధిత మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జూలై 3, 4, 5 తేదీల్లో ఏలూరులో జరిగే రైతు సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి




- **జూలై 10 అంగన్వాడీ ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొనాలి**
- **స్కీం వర్కర్లకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలి**

**కుక్కునూరు,జూన్ 23( మనం న్యూస్ ):** కూటమి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సిఐటియు మండల కన్వీనర్ యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నాడు స్థానిక సుందరయ్య భవనం ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన సీఐటీయూ కుక్కునూరు మండల కమిటీ సమావేశం మండల కో-కన్వీనర్ బాడిస సుజాత అధ్యక్షతన జరిగింది. అంగన్వాడీ ఉద్యోగులు, హెల్పర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, జూలై 10న అంగన్వాడీ కోరికల దినోత్సవం సందర్భంగా ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో మండలంలోని అంగన్వాడీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా రైతులు, కార్మికులు, గ్రామీణ పేదల సమస్యల పరిష్కారానికి జూలై 3, 4, 5 తేదీల్లో ఏలూరులో జరిగే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం 23వ రాష్ట్ర మహాసభలు కీలకమని తెలిపారు. రైతులు, కార్మికులు, స్కీం వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు పోచారపు వెంకటేశ్వర్లు, కారం వందన,మహాలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, స్కీం వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కింద ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ



- **జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

**అనంతపురం, కలెక్టరేట్ జూన్ 23 :** మనం న్యూస్ ఎస్ఐఆర్ - 2026 కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు 17,00,945 ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి బిఎల్ఓల ద్వారా ఇంటింటి సందర్శనలు నిర్వహించడం జరుగుతోందన్నారు. జిల్లాలో 2,226 మంది బిఎల్ఓలు ఉండగా, అందులో అందరు బిఎల్ఓలకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలో మొత్తం 20,38,523 ఓటర్లు ఉన్నారని, అందులో సోమవారం ఉదయం 8 గంటల వరకు 15,95,586 మందికి ఎన్యుమరేషన్ ఫారాలను అందించడం జరిగిందని, ఈరోజు సాయంత్రం 6 గంటల వరకు 17,00,945 మందికి ఎన్యుమరేషన్ ఫారాలను అందించడం జరిగిందన్నారు. ఈరోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 10,53,59 మందికి ఎన్యుమరేషన్ ఫారాలను అందించడం జరిగిందని తెలిపారు.

## పాములకు నిలయంగా లక్ష్మాపురం గురుకుల.. లింగాల నాగరాజు



నందికొట్కూర్: పగిడ్యాల(మనం న్యూస్) వసతులు లేని లక్ష్మాపురం డ్వాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల అని లింగాల నాగరాజు ఈ సందర్భంగా అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం నాడు డ్వాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు. నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం లక్ష్మాపురం డ్వాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో పాముల బెడద అంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడం వలన మంగళవారం ఈవీఎంసీ మెంబర్ లింగాల నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేసి సందర్భంగా వివరిస్తూ గురుకుల పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చుట్టూ ప్రహరీ గోడను అనుకొని పిచ్చి మొక్కలు ఎక్కువగా పెరిగి పోయి వనముల తయారై పాములకు నివాస కేంద్రాలుగా మారిందని ఆయన వాపోయారు.

## వైభవంగా వాదీంద్ర తీర్థుల ఆరాధన



మంత్రాలయం , జూన్ ,23,మనం న్యూస్ ;- ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో వాదీంద్ర తీర్థుల ఆరాధన వేడుకలు మఠం పీఠాధిపతులు సుభదేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా వాదీంద్ర తీర్థుల బృందావనానికి విశేష పంచామృతాభిషేకాలతో పూజల నిర్వహించారు. అనంతరం వాదీంద్ర తీర్థుల బృందావన చిత్రపటాన్ని స్వర్ణ రథం పై ఉంచి ప్రత్యేక పూజలు చేసి , మంగళహారతి ఇచ్చి భజన మండలి సభ్యులు , భక్తుల కోలాటాల మధ్య ఘనంగా ఊరేగించారు. తదనంతరం స్వర్ణ మండపంలో పండితులు జ్ఞానోదయమైన ప్రవచనాలను చేశారు. వాదీంద్ర తీర్థుల ఆరాధనను పురస్కరించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి వివిధ ప్రత్యేక పూజలు చేసి , మంగళహారతి ఇచ్చి , సుందరంగా అలంకరణ చేశారు. సంస్థాన పూజల్లో భాగంగాలో మూల రామదేవతలకు మఠం పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు ప్రత్యేక పూజలు చేసి , ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. ఈ ఉత్సవానికి తిలకించేందుకు వచ్చిన వివిధ రాష్ట్రాల భక్తులు తరలివచ్చారు. ముందుగా భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని , రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. వారికి మఠం పీఠాధిపతులు ఫల మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మఠం ఏఏఓ మాధవశెట్టి , మఠం మేనేజర్ ఎస్ కే శ్రీనివాసరావు ,వెంకటేష్ జోషి , ఇంజనీరింగ్ సురేష్ కోనాపూర్ , సూపర్డెంట్ అనంత రాఘవేంద్ర వీఆర్వో హోనలి వ్యాసరాజు స్వామి , మఠం సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట భద్రత

- కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్
- 1200 మంది పోలీసులతో బందోబస్తు

కర్నూలు జూన్ 23మనం న్యూస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 24వ తేదీన పత్తికొండ నియోజకవర్గంలోని జొన్నగిరిలో ఉన్న జియో మైసూర్ గోల్ మైన్స్ ప్లాంట్ను సందర్శించనున్న నేపథ్యంలో జిల్లా పోలీసు శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసింది.ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా హెలిప్యాడ్, సభా ప్రాంగణం తదితర ప్రాంతాల్లో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.బందోబస్తు విధుల నిమిత్తం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి మంగళవారం జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని పగిడిరాయి గ్రామంలో గోల్ మైన్స్ సమీపంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ దిశానిర్దేశం చేశారు.



## సీఎం రాకకై క్షేత్రస్థాయిలో ఏర్పాట్లును పర్యవేక్షించిన జిల్లా అధికారులు మంత్రాలయం టీడీపీ నేతలు



మంత్రాలయం , జూన్ ,23,ఆంధ్ర ఆక్షర న్యూస్; మంత్రాలయం మండల పరిధిలోని మాధవరం గ్రామానికి గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను జోనల్ ఇంచార్జి శ్రీనివాస రెడ్డి ,టిడిపి జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ మంత్రాలయం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అనంతరం డిఐజి ప్రమీణ్ జిల్లా కలెక్టర్ ఏ. సిరి ఎస్పీ విక్రాంత్ పటేల్ తో కలిసి హెలిప్యాడ్, సభా ప్రాంగణం, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, భోజన ఏర్పాట్లు, బారికేడింగ్, తాగునీటి సదుపాయాలు, ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తల కోసం చేపట్టిన ఏర్పాట్లను స్వయంగా తనిఖీ చేసి తుది ఆదేశాలు జారీ చేశారు.ముఖ్యమంత్రి పర్యటనను చారిత్రాత్మక విజయంగా నిలిపేందుకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. సభకు భారీ సంఖ్యలో రైతులు, మహిళలు, యువత, పార్టీ శ్రేణులు తరలిరానున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రమాదేవి , వివిధ శాఖల అధికారులు , మంచాల సొసైటీ చైర్మన్ రామకృష్ణ రెడ్డి , టిడిపి నాయకులు పల్లెపాడు రామిరెడ్డి , చావిడి వెంకటేష్ , ఆర్ లక్ష్మన్న , చాపల నాగేష్ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

## సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

- స్వర్ణ వార్డ్ అధికారి భాస్కర్ నాయుడు



మంత్రాలయం , జూన్ ,23,మనం న్యూస్;- సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని గ్రామ స్వర్ణ వార్డ్ ఆఫీసర్ భాస్కర్ నాయుడు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని మాధవరం గ్రామంలోని సచివాలయం 1, 2లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు.సచివాలయానికి వచ్చే ప్రజలు, రైతులతో మర్యాదగా, సౌమ్యంగా ప్రవర్తించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి ప్రతి ఒక్కరికీ వివరించి, అర్హులైన లబ్ధిదారులకు అవి చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే కుల ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేటప్పుడు, భూముల సర్వేలు నిర్వహించేటప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన రుసుమును మాత్రమే వసూలు చేయాలని స్పష్టం చేశారు. సర్వేయర్లు, సిబ్బంది రైతుల నుంచి అదనపు నగదును ఎట్టి పరిస్థితుల్లోనూ ఆశించవద్దని హెచ్చరించారు. సచివాలయ సిబ్బంది ప్రతిరోజూ నిర్ణీత సమయానికి విధులకు హాజరై, కార్యాలయ వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. సమయపాలన పాటించని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ తనిఖీల్లో ఎంపీడీవో నూర్జహాన్, డిప్యూటీ ఎంపీడీవో, ఉపేంద్ర రెడ్డి పంచాయతీ సెక్రెటరీ వేణుగోపాల్, గ్రామ మండల అధికారి ఆశా బేగం సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతన్న మీకోసం వార్షికోత్సవం

దేవనకొండ, జూన్ 23, ( మనం న్యూస్ ) ఈరోజు దేవనకొండ మండల కేంద్రంలో రైతన్న మీకోసం వారోత్సవ కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి బి ఉషారాణి గారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది.కార్యక్రమ ముఖ్య ఉద్దేశం: రైతుల సంక్షేమమే ధ్యేయంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'రైతన్న మీకోసం - ఇంటింటి వారోత్సవాలు' మరియు 'గ్రామ రైతు వేడుకలు' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతోంది. సాగు పద్ధతులు, విత్తన రకాలు, మరియు తెగుళ్ల నివారణపై రైతులకు ఉన్న సకల సందేహాలను నివృత్తి చేసి తగిన సాగు సలహాలను ఉచితంగా అందజేయడం జరుగుతుంది. ప్రభుత్వం అందిస్తున్న అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ మరియు ఇతర సంక్షేమ పథకాల గురించిన పూర్తి సమాచారాన్ని, అర్హతలను రైతులకు క్లుప్తంగా వివరించడం జరుగుతుంది.



## ముఖ్యమంత్రి జొన్నగిరి పర్యటనపర్పాట్లను పరిశీలించిన సి.ఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్, జిల్లా కలెక్టర్



కర్నూలు/జూన్:23 మనం న్యూస్ : 24న జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో కార్యక్రమ ఏర్పాట్లను సి.యం ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, జిల్లా కలెక్టర్ డ్వాక్టర్ ఎ. సిరి మంగళవారం పరిశీలించారు.జొన్నగిరిలో జియో మైసూర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బంగారు గనుల ప్రాజెక్టులో నూతన ప్లాంట్కు ముఖ్యమంత్రి భూమిపూజ చేసి ప్రారంభించనున్న నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్లను సి.యం ప్రోగ్రాం కోఆర్డినేటర్, కలెక్టర్ పరిశీలించారు.ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమ వేదిక, రహదారులు, పారిశుద్ధ్యం, ఆహారం, తాగునీరు, విద్యుత్ సరఫరా, అంతర్జాలం, రవాణా, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రత, వైద్య సదుపాయాల ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని సి.యం ప్రోగ్రాం కోఆర్డినేటర్, కలెక్టర్ సూచించారు.

## వైసీపీకి చెందిన 50 కుటుంబాలు టీడీపీలోకి చేరిక

ఎమ్మిగనూరు జూన్ 23 మనం న్యూస్ నియోజకవర్గ లో గోనెగండ్ల మండలం పరిధిలోనిఎర్రబాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. ఎమ్మెల్యే డ్వాక్టర్ బీవీ. జయనాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలోవైసీపీకి చెందిన పెద్ద కౌలుట్లయ్య, చిన్న కౌలుట్లయ్య, పెద్ద కేశన్న, చిన్న కేశన్న కుటుంబాలకు చెందిన 50 మంది టీడీపీ కండువా కప్పుకున్నారు. కూటమి పథకాలకు ఆకర్షతులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారు పార్టీ బలోపేతంకు, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని కోరారు. అనంతరం పార్టీలో చేరిన వారూ ఎమ్మెల్యే బీవీ ను గజమాలతో సన్మానించారు ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, గ్రామ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు



## సీఎం రిలీఫ్ ఫండ్ సీఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం పాల్గొన్నఎమ్మెల్యే



ఎమ్మిగనూరు జూన్ 23 మనం న్యూస్ పట్టణంలోని ఆర్ బి అతిథి గృహంలో నిర్వహించిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డ్వాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మిగనూరు నందవరం గోనెగండ్ల మండలాలకు చెందిన 88 మంది లబ్ధిదారులకు రూ. 61,23,755 విలువైన చెక్కులను ఎమ్మెల్యే డ్వాక్టర్ బీవీ అందజేశారు. వనియోజకవర్గానికి చెందిన మొత్తం 348 మంది లబ్ధిదారులకు రూ.2.82 కోట్ల మేర సహాయం అందించబడిందని ఎమ్మెల్యే డ్వాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఆపద్బాంధవుడిగా నిలుస్తోందని, అత్యవసర వైద్య చికిత్సలు, ప్రమాదాలు మరియు ఇతరక్లిష్ట పరిస్థితుల్లో కుటుంబాలకు ఆర్థిక భరోసాను కల్పిస్తోందన్నారు.

## లెంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టంపై గోడ పత్రిక లను విడుదల చేసిన జిల్లా జడ్జి '



కర్నూలు జూన్ 23మనం న్యూస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు మరియు జిల్లా జడ్జి జి. కబర్ధి గారి చేతుల మీదుగా లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం పై ప్రచురించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. జిల్లా జడ్జి మాట్లాడుతూ లైంగిక నేరాల నుండి రక్షణ చట్టం 2012 ప్రకారం పిల్లల పై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు కలవని తెలిపారు. 18 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడకుండా ఈ పోక్సో యాక్ట్ ఉపయోగ పడుతుందని తెలిపారు.ఈ పోక్సో కేసుల ను త్వరిత గతిన పరిష్కరించేందుకు ప్రత్యేక కోర్ట్ కలదని తెలిపారు. పిల్లలకు ఏదయినా సమస్య వస్తే లీగల్ సర్వీసెస్ టోల్ ఫ్రీ నెంబర్ 15100 కాల్ చేస్తే వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సదస్సు లో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, ఎక్సజ్ మేజిస్ట్రేట్ అనిల్ కుమార్, లీగల్ సర్వీసెస్ యూనిట్ మెంబర్ డ్వాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కర్నూలు జిల్లా అడ్వకేట్స్ స్పోర్ట్స్ మీట్లో రామకృష్ణ నాయుడు ప్రతిభ

ఎమ్మిగనూరు, జూన్ 23 మనం న్యూస్ ఉమ్మడి కర్నూలు జిల్లా అడ్వకేట్స్ స్పోర్ట్స్ మీట్-2026లో నిర్వహించిన క్యారమ్స్ పోటీల్లో ఎమ్మిగనూరు బార్ అసోసియేషన్ సభ్యుడు, అడ్వకేట్ రామకృష్ణ నాయుడు ద్వితీయ స్థానం సాధించి ప్రతిభ చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మిగనూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామకృష్ణ నాయుడును ఘనంగా సన్మానించారు. న్యాయవృత్తితో పాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని పలువురు న్యాయవాదులు కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి బార్ అసోసియేషన్కు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు దామోదర్ రెడ్డి, జగన్నాథ రెడ్డి, మురళీకృష్ణ, రంగనాథ్, రఘురాం, పీఎంఆర్ ప్రసాద్, జి.ఎం. భాష, ఎం.కే. లింగమూర్తి, రంగన్న, సామెల్ తదితరులు పాల్గొని రామకృష్ణ నాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది

## జి రామ్ జీ నూతన చట్టం ద్వారా వ్యవసాయ కార్మికులకు తీవ్ర అన్యాయం



- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్నియధావిధిగా కొనసాగించాలి

బేతంచేర్ల జూన్ 23 మనం న్యూస్ కేంద్ర ప్రభుత్వం ఇటీవల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి కొత్త చట్టం విబి జి రామ్ జి తెచ్చి పేదల నోట్లో మట్టి కొట్టాలనే ప్రయత్నం చేస్తున్నట్లు స్పష్టంగ కనపడుతున్నది ఉపాది హామీ నిధుల్లో ఏపీకి భారీగా 40 వేల కోట్ల కోత పడుతున్నట్లు అర్థమవుతున్నదని రాష్ట్ర ప్రయోజనాలపై రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం మాట అయినా కూడా మాట్లాడని పరిస్థితి నెలకొన్నదనినూతన చట్టాన్ని రద్దుచేసి యధావిధిగా పాత చట్టాన్ని కొనసాగించాలని బి.కే.ఎం.యు జాతీయ సమితి పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బేతంచెర్ల మండల సమితి ఆధ్వర్యంలో తహసిల్దార్ నాగమణి కి డిమాండ్స్ కూడిన వినతిపత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో బి.కె.ఎ.యు మండల కార్యదర్శి దస్తగిరి మండల నాయకులు సోమన్న నాగేశ్వరరావు పాల్గొన్నారు

## ఎస్సీ బాలుర, బాలికల హాస్టల్స్ను ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరు జూన్ 23 మనం న్యూస్ పట్టణంలోని ఎస్సీ గర్ల్స్ బాయ్స్ కు హాస్టల్ ఏర్పాటు తక్షణమే ఎస్సీ విద్యార్థులకు హాస్టల్ ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తహశీల్దార్ శ్రీనివాసులు కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు గఫూర్, ఏఐఎస్ఎఫ్ పట్టణ సహాయ కార్యదర్శి షఫీద్ బాషా మాట్లాడుతూ హై స్కూల్ ఎస్సీ విద్యార్థులకు( బాలుర మరియు బాలికల)లకు హాస్టల్ ఏర్పాటు చేసి వారి విద్యకు తోడ్పాటు అందించాల్సిన పాలకులు నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరించడం దారుణమని వారు తెలిపారు. ఈ ప్రాంతాలలో నిత్యం కరువు వలసలతో ప్రజలు ఇతర ప్రాంతాలకు ముఠాముల్లా సర్దుకుని పిల్లజల్లతో వెళ్లి జీవనం గడుపుతున్నారని ఇలాంటి సమయంలో హాస్టల్స్ లేకపోతే విద్యార్థులు విద్యను మధ్యలో ఆపి వారి పిల్లలను తల్లిదండ్రుల వెంట తీసుకెళ్లడం జరుగుతుందని దీంతో నిరక్షరాసత పెరగడం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.



## ఆర్టీసీని ప్రైవేటీకరించొద్దు... కొత్త బస్సులు కొనాలి

హిందూపురం (మనం న్యూస్) జూన్ 23: ఆర్టీసీ ప్రైవేటీకరణ నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, కాలం చెల్లిన పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ హిందూపురం ఆర్టీసీ డిపో గేట్ ఎదుట ఆర్టీసీ కార్మికులు మంగళవారం నిరసన చేపట్టారు. జేఏసీ ఎంప్లాయిస్ యూనియన్, ఎన్ఎంయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆందోళనలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ, ఉద్యోగులకు రావాల్సిన 24 నెలల పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి సురక్షితమైన, నాణ్యమైన రవాణా సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.పాత బస్సుల కారణంగా తరచూ బ్రేక్డౌన్లు జరుగుతున్నప్పటికీ గ్యారేజీ సిబ్బందిపై చార్జిషీట్లు జారీ చేయడం, శిక్షలు విధించడం అన్యాయమని పేర్కొన్నారు.

## మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం కావాలి

- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం, కలెక్టరేట్ జూన్ 23 : మనం న్యూస్: డ్రగ్స్ మరియు గంజాయి సమస్యను అరికట్టడంలో అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పనిచేయాలని, జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం కావాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో మాదకద్రవ్యాలు మరియు గంజాయి నియంత్రణ చర్యలు - అవగాహన కార్యక్రమాల సమీక్షకు సంబంధించి ఎన్సిఓఆర్డీ (నార్కో కోఆర్డినేషన్ సెంటర్, నకార్డ్ ) జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా ఎస్పీ పి.జగదీష్ తో కలిసి జిల్లా కలెక్టర్ నిర్వహించారు. విద్యాసంస్థల్లో వారానికొకసారి అవగాహన కార్యక్రమాలు డిఈఓ, ఆర్ఐఓ, ఆర్జెడిలు పాఠశాలలు మరియు కళాశాలల్లో డ్రగ్స్, గంజాయి దుష్ప్రభావాలపై ప్రతి వారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో మాదకద్రవ్యాల వినియోగం లేదా విక్రయాలపై అనుమానాస్పద సమాచారం సమాచారం లభిస్తే వెంటనే పోలీసు శాఖకు తెలియజేయాలన్నారు.

## మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు

- ఇష్టారాజ్యంగా మద్యం విక్రయాలు.. నెలవారీ వసూళ్ల ఆరోపణలు
- నియమ నిబంధనలు గాలికి వదిలేసారు
- మేమున్నాం... మీరు అమ్ముకోండి..ఎవరు వస్తారో చూద్దాం... అంటున్నఎక్సేంజ్ అధికారులు..



ధర్మవరం అర్బన్, జూన్ 23 మనం న్యూస్ పట్టణం పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బెల్టాపులు, అనధికార విక్రయ కేంద్రాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు, అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట వేయాల్సిన కొందరు అధికారులు నెలవారీ మామూళ్ల వ్యవస్థను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఓ ఎక్సేంజ్ ఎస్ఐ ద్వారా సిఐ కి ముడుపులు ధర్మవరం ఎక్సైజ్ కార్యాలయంలో ధర్మవరం పట్టణం, బత్తలపల్లి ముదిగుబ్బ తాడిమర్రి మండల పరిధిలో అధికారకంగా 20 మద్యం దుకాణాలతో పాటు మూడు బార్లు ఉన్నట్లు ఆ శాఖ అధికారులు లెక్కలు చెబుతున్నాయి. వీటి ద్వారా ప్రతినెల భారీ మొత్తంలో అక్రమంగా నగదు వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఎక్సైజ్ ఎస్సై ద్వారా సీఐ కార్యాలయానికి ప్రతి నెల మద్యమం దుకాణం నుంచి రూ 20 వేల నుంచి 25 వేల దాకా ముడుపులు అప్పచెప్పుతున్నట్లు విశ్వసినే సమాచారం. దీంతోపాటు వైన్ షాప్ పరిధిలో ఉన్న బెల్టు షాపుల ద్వారా ప్రతి షాపు నుంచి రూ. 2000 రూపాయలు ప్రతినెల కార్యాలయానికి అందుతున్నట్లు తెలుస్తుంది. ప్రతినెల రూ.లక్షల్లో ఎక్సైజ్ కార్యాలయానికి ఆయా వైన్ షాప్ యజమానులు అందజేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటిపై సమగ్రంగా ఎక్సైజ్ ఉన్నతాధికారులు విచారణ చేస్తే నిజా నిజాలు నెగ్గు తేలుతాయి అని ప్రజలు విశ్వసిస్తున్నారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయానికి చెందిన ఓ అధికారి ద్వారా ఉన్నతాధికారులకు మామూళ్లు చేరుతున్నాయన్న ప్రచారం జరుగుతోంది. దీంతో అక్రమ మద్యం విక్రయదారులు నిర్భయంగా వ్యాపారం సాగిస్తున్నారని స్థానికులు అంటున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్ణీత సమయాలకు మించి మద్యం విక్రయాలు జరుగుతున్నప్పటికీ, తనిఖీలు మాత్రం కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమ విక్రయాల కారణంగా యువత చెడు అలవాట్ల బారిన పడుతున్నారని, కుటుంబాలపై ఆర్థిక భారం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆరోపణల్లో వాస్తవాలు ఉన్నాయా? అక్రమ విక్రయాలకు ఎవరి అండదండలు ఉన్నాయి? మామూళ్ల వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్న ప్రాంతాలపై ప్రత్యేక దాడులు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఫిఫా వరల్ కప్.. చరిత్ర సృష్టించిన మెస్సి

ఫిఫా ప్రపంచకప్ లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా తన హవా కొనసాగిస్తోంది. టెక్సాస్ లోని డాలస్ స్టేడియంలో జరిగిన గ్రూప్-జే మ్యాచ్ లో 2-0 గోల్స్ తేడాతో ఆస్ట్రియాపై విజయం సాధించింది. ఆ రెండు గోల్స్ కూడా అర్జెంటీనా స్టార్ ప్లేయర్ మెస్సి నుంచే రావడం గమనార్హం. అదేవిధంగా ఈ గేమ్ లో అతడు రికార్డు సృష్టించాడు. ఫిఫా వరల్ కప్ చరిత్రలోనే అత్యధిక గోల్స్ (18) కొట్టిన ఆటగాడిగా నిలిచాడు. 38వ నిమిషంలో చేసిన గోల్ ద్వారా జర్మనీ ఆటగాడు మిరోస్లావ్ క్లోస్ (16 గోల్స్) రికార్డును బద్దలుకొట్టాడు.



అనంతరం మరో గోల్ కూడా మెస్సినే సాధించాడు. ఫిఫా ప్రపంచకప్లకు సంబంధించి వరుసగా ఆరు మ్యాచ్ లలో గోల్ కొట్టిన మూడో ఆటగాడిగానూ నిలిచాడు. అంతకుముందు ఫ్రాన్స్ స్ట్రైకర్ జస్ట్ ఫాంటైన్, బ్రెజిల్ దిగ్గజం జైర్ జిన్హోలు ఈ ఘనత సాధించారు.

## వారసుడని ప్రేక్షకులు చూడరు: రామ్ చరణ్

సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ.. ప్రేక్షకులు ఎప్పుడూ మన కష్టాన్ని చూసే ఆదరిస్తారని రామ్ చరణ్ అన్నారు. తాజాగా ఆయన 'రిపబ్లిక్ సమ్మిట్'లో పాల్గొని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. బిజినెస్ భాషలో చెప్పాలంటే.. 'పెద్ది' సినిమా తన కెరీర్కు బెస్ట్ 'స్టార్టప్' లాంటిదని వెల్లడించారు.

''నా చిన్నప్పుడు దర్శకులు, నిర్మాతలు 'మీ నాన్న కంటే బాగా చేయాలి' అని చెప్పినప్పుడు బాధ్యతగా అనిపించేది. నేను ఆ ఒత్తిడిని పెద్దగా పట్టించుకోలేదు. మా నాన్న ఇంట్లో సరదాగా ఉంటారు. మా డైనింగ్ టేబుల్ మీద సినిమా చర్చలు, స్టార్డమ్ ముచ్చట్లు ఎప్పుడూ రానిచ్చేవారు కాదు. సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి రావడం వల్ల త్వరగా ఒక మంచి వేదిక దొరుకుతుందనేది నిజమే.. కానీ, ప్రేక్షకులు మనల్ని ఎవరి వారసుడు అని చూడరు.. మొదటి సినిమా తర్వాత కేవలం మన కష్టం, నిజాయతీ మాత్రమే చూస్తారు. నా 15 ఏళ్ల కెరీర్లో ఆయన నాకు ఎప్పుడూ నటన పరంగా ఫీడ్బ్యాక్ ఇవ్వలేదు. నన్ను వేలు పట్టి నడిపించలేదు. కానీ క్రమశిక్షణ విషయంలో ఆయనే నాకు స్ఫూర్తి'' అని చెప్పారు.

ఓటీటీల ట్రెండ్ గురించి మాట్లాడుతూ.. ''థియేటర్లు, ఓటీటీలు రెండూ ఒకదానికొకటి సాయం చేసుకుంటూ ముందుకు సాగాలి. 'ఆర్ఆర్ఆర్' థియేటర్లలో విడుదలైన తర్వాత నెట్ఫ్లిక్స్లో అందుబాటులోకి వచ్చింది.



దానివల్ల పాశ్చాత్య దేశాల ప్రజలకు కూడా సినిమా చేరి, ఆస్కార్ నామినేషన్ వరకు వెళ్లేలా క్రేజ్ పెరిగింది. జపాన్లో కూడా సోషల్ మీడియా బజ్ వల్లే రూ.65 కోట్లకు పైగా వసూళ్లు వచ్చాయి. భారతదేశంలో ఇప్పటికీ ఒక కుటుంబానికి అత్యంత తక్కువ ఖర్చుతో దొరికే వినోదం సినిమానే. థియేటర్లలో పాప్కార్న్ ధరలు కాస్త తగ్గితే ఇంకా బాగుంటుంది. సినిమా అనేది ఓ భావోద్వేగం.. అది ఎప్పటికీ అలానే ఉంటుంది. దేశభక్తి కథలకు ఎప్పుడూ ప్రాధాన్యతనివ్వాలి. ఒక సినిమా రూ.500 కోట్లు లేదా రూ.800 కోట్లు వసూలు చేస్తోందంటే, దానర్థం దేశంలోని ప్రజలు ఆ కథను తమ సొంత కథగా భావించి ఆదరిస్తున్నారనే. దేశాన్ని ఏకం చేసే ఇలాంటి సినిమాలు రావడం గొప్ప విషయం'' అని రామ్ చరణ్ తెలిపారు.





## తెలుగమ్మాయి శ్రీచరణి ప్రపంచ నంబర్ 1 బౌలర్

భారత్ స్పిన్నర్, తెలుగమ్మాయి శ్రీచరణిరికార్డు సృష్టించింది. ప్రపంచ నెంబర్ 1 ఉమన్ టీ20 బౌలర్ గా నిలిచింది. తాజా అంతర్జాతీయ టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్ లో ఇంగ్లాండ్ స్పిన్నర్ లిన్సే స్మిత్ ను అధిగమించి అగ్రస్థానానికి ఎగబాకింది. తాజా టీ20 ప్రపంచకప్ లో మూడు మ్యాచ్ లు ఆడిన శ్రీచరణి 10 వికెట్లు పడగొట్టింది. నిరుడు జూన్ 28న ఇంగ్లండ్ తో మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ పొట్టి ఫార్మాట్లోకి అడుగుపెట్టింది. శ్రీచరణి ప్రపంచ నంబర్ 1 ఉమన్ టీ20 బౌలర్గా నిలవడంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. గతేడాది ఆమెతో మాట్లాడానని, క్రికెట్లోకి అడుగుపెట్టిన తొలినాళ్లలో తాను ఎదుర్కొన్న సవాళ్ల గురించి ఆమె చెప్పిన విషయాలు ఇంకా గుర్తున్నాయని అన్నారు. ప్రతిభ, పట్టుదల, కఠోర శ్రమ ఉంటే.. ప్రతిఫలం తప్పక లభిస్తుందని చెప్పడానికి శ్రీచరణి నిదర్శనమన్నారు. '' యావత్ రాష్ట్రం నిన్ను చూసి గర్విస్తోంది. మరిన్ని రికార్డులు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా'' అని ఎక్స్లో పోస్టు చేశారు.



## డార్లింగ్... ది ఎటర్నల్ వార్

ప్రపంచవ్యాప్తంగా ఇండియన్ సినిమా స్టామినాని చాటిచెప్పిన 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి మరో క్రేజీ ప్రాజెక్ట్ ముస్తాబవుతోంది. తాజాగా పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తన ఇన్స్టాగ్రామ్ ద్వారా అభిమానులకు ఓ సర్ప్రైజ్ ఇచ్చారు. 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' అనే కొత్త యానిమేషన్ ప్రాజెక్ట్ ఫస్ట్ లుక్ పోస్టర్ను పంచుకుంటూ డార్లింగ్ ఫ్యాన్స్ను ఖుషీ చేశారు. ఈ పోస్టర్లో ప్రభాస్ యానిమేషన్ అవతార్లో యోధుడిలా కనిపిస్తూ గూస్బంప్స్ తెప్పిస్తున్నారు.

**అంతర్జాతీయ వేదికపై బాహుబలి**

ఫ్రాన్స్లోని అన్నెసీ వేదికగా జరిగే ప్రతిష్టాత్మక 'అన్నెసీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026' కి ఈ ప్రాజెక్ట్ ఎంపికైంది. ఇక్కడ జరిగే 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' సెషన్స్లో 'బాహుబలి: ది ఎటర్నల్ వార్'ను ప్రదర్శించబోతున్నారు. ఈ విషయాన్ని స్వయంగా ప్రభాస్ పంచుకోవడంతో అభిమానులు సోషల్ మీడియాలో తెగ షేర్ చేస్తున్నారు. పోస్ట్ పెట్టిన కొద్ది నిమిషాల్లోనే లక్షకు పైగా లైక్స్, వేలాది కామెంట్స్ రావడం విశేషం.

రాజమౌళి సమర్పణలో..

ఆర్కా మీడియా వర్క్స్ నిర్మాణంలో వస్తున్న ఈ భారీ యానిమేషన్ చిత్రానికి అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇషాన్ శుక్లా ఈ ప్రాజెక్ట్కు దర్శకత్వం వహిస్తున్నారు. బాహుబలి ది ఎటర్నల్ వార్ ప్రాజెక్ట్.. అన్నెసీ యానిమేషన్ ఫెస్టివల్కు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. మా టీమ్ నిజంగా ఒక అద్భుతాన్ని సృష్టిస్తోంది. ఈ ప్రాజెక్ట్ను ప్రపంచం ఎప్పుడెప్పుడు చూస్తుందా అని నేను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను అంటూ ప్రభాస్ తన పోస్ట్లో రాసుకొచ్చారు.

బాహుబలి సిరీస్ సినిమాలతో బాక్సాఫీస్ను షేక్ చేసిన ఈ కాంబో, ఇప్పుడు యానిమేషన్ రూపంలోనూ గ్లోబల్ లెవెల్లో సత్తా చాటేందుకు సిద్ధమవుతోంది. ఫ్రాంచైజీకి ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ కొత్త అవతార్ ప్రేక్షకులను అలరించడం ఖాయంగా కనిపిస్తోంది.



## వైభవ్ చేతికి టీమ్ఇండియా జెర్సీ

క్రికెట్ యువ సంచలనం, యూనివర్స్ బేబీ బాస్ వైభవ్ సూర్యవంశీ జాతీయ జట్టులో అరంగేట్రం చేస్తున్నాడు. మరికొద్ది రోజుల్లో అతడు టీమ్ఇండియా తరపున తొలి మ్యాచ్ ఆడనున్నాడు. ఈ నేపథ్యంలో తాజాగా భారత జెర్సీని అందుకున్నాడు. ఇందుకు సంబంధించిన వీడియోను బీసీసీఐ తాజాగా సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది.

''యావత్ దేశం ఎదురుచూస్తున్న క్షణం వచ్చేసింది. వైభవ్ సూర్యవంశీ టీమ్ఇండియా జెర్సీని అందుకున్నాడు. ఆ అద్భుత క్షణాలను మీరూ చూసేయ్యండి'' అని బీసీసీఐ రాసుకొచ్చింది. ఈ యువ సెన్సేషన్ 'నంబరు 3'తో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ప్రఖ్యాత త్రోడౌన్ స్పెషలిస్టు రఘు నుంచి వైభవ్ ఈ జెర్సీని అందుకున్నాడు. ఈ జెర్సీ ఇచ్చేందుకు రఘు గది వద్దకు రాగానే.. వైభవ్ అతడి కాళ్లకు నమస్కరించడం వీడియోలో కన్పించింది.

ఈ సందర్భంగా వైభవ్ మాట్లాడుతూ.. ''కొన్ని సార్లు మనం ఊహించని అద్భుతాలు జరుగుతుంటాయి. అలాంటి క్షణాల్లో ఎలా స్పందించాలో కూడా అర్థం కాదు. ప్రస్తుతం నేను అలాంటి పరిస్థితిలోనే ఉన్నా. క్రికెట్ బ్యాట్ పట్టుకుని గ్రౌండ్లో ప్రాక్టీస్కు వెళ్లిన తొలి రోజు నుంచే.. టీమ్ఇండియా జెర్సీ వేసుకోవాలని కలలు కన్నా. ఈ రోజు ఆ కల నెరవేరింది. నా క్రికెట్ ప్రయాణంలో కీలక దశ మొదలైంది. టీమ్ఇండియా జెర్సీ నా చేతికొచ్చింది. ఈ ఆనందాన్ని నేను మాటల్లో వర్ణించలేను. ఇదంతా ఓ కలలా ఉంది. జెర్సీని చేతిలో తీసుకోగానే సంతోషం పట్టలేకపోయా'' అని తన ఆనందాన్ని పంచుకున్నాడు.

గతంలో నంబరు 3 జెర్సీతో హర్భజన్ సింగ్, సురేశ్ రైనా జాతీయ జట్టులో ఆడారు. వారు రిటైర్మెంట్ తీసుకోవడంతో ఆ నంబరును ఇప్పుడు వైభవ్కు కేటాయించారు. కాగా.. మరికొద్ది రోజుల్లో ఐర్లాండ్, ఇంగ్లాండ్తో జరగబోయే టీ20 సిరీస్లకు వైభవ్ను బీసీసీఐ ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. అయితే, తుది జట్టులో అతడికి చోటు దక్కుతుందా లేదా అనేదానిపై సందిగ్ధత కొనసాగుతోంది. ఓపెనర్ స్థానం కోసం అతడు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, సంజూ శాంసన్ వంటి సీనియర్లతో పోటీ పడాల్సి ఉంటుంది.

## నితీశ్ రెడ్డి ఔట్.. సూర్యాంశ్ కు ఛాన్స్

ఐర్లాండ్, ఇంగ్లాండ్ సిరీస్ లకు టీమ్ఇండియా సిద్ధమవుతోన్న వేళ ఆటగాళ్ల గాయాల బెడద జట్టును వెంటాడుతోంది. ఇప్పటికే మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి టీ20 జట్టు నుంచి వైదొలగగా.. తాజాగా ఆల్ రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి కూడా దూరమయ్యాడు. తొడ కండరాల గాయం కారణంగా ఐర్లాండ్, ఇంగ్లాండ్ తో టీ20 సిరీస్ కు అతడు అందుబాటులో ఉండడని బీసీసీఐ వెల్లడించింది. అతడి స్థానంలో సూర్యాంశ్ షెడ్గేను జట్టులోకి తీసుకుంది. ఈ మేరకు తాజాగా ప్రకటన విడుదల చేసింది.



అఫ్గాన్తో వన్డే సిరీస్ ఆడుతుండగా నితీశ్ గాయపడిన సంగతి తెలిసిందే. తొలుత చిన్న దెబ్బే అనిపించినా.. ఎమ్మారైలో తొడ కండరాలకు గాయమైనట్లు తెలిసింది. అతడు కోలుకునేందుకు కనీసం నాలుగు వారాల సమయం పడుతుందని వైద్యులు వెల్లడించారు. ఆ తర్వాత కూడా ఫిట్నెస్ నిరూపించుకునేందుకు మరికొంత సమయం అవసరం. దీంతో ఐర్లాండ్, ఇంగ్లాండ్ సిరీస్ లకు బీసీసీఐ అతడిని జట్టు నుంచి తొలగించింది. నితీశ్ వైదొలగడంతో యువ ఆటగాడు సూర్యాంశ్ కు ఛాన్స్ లభించింది. ఇటీవల శ్రీలంక-ఎ జట్టుతో జరిగిన ముక్కోణపు సిరీస్ లో ఇతడు నిలకడైన ప్రదర్శన చేశాడు. ఈ మిడిలార్డర్ బ్యాట్స్మన్ ఐదు మ్యాచ్ ల్లో 147 పరుగులు సాధించాడు. బంతితోనూ రాణించాడు. 2024-25లో జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ముంబయి తరఫున 131 పరుగులు చేసి బీసీసీఐ సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. జూన్ 26-28 మధ్య ఐర్లాండ్తో టీమ్ఇండియా రెండు టీ20 మ్యాచ్లు ఆడనుంది. ఆ తర్వాత జులై 1 - 11 మధ్య ఇంగ్లాండ్ తో ఐదు టీ20ల సిరీస్ జరగనుంది.

## మాలీవుడ్కి భాగ్యశ్రీ...

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే చేసిన చిత్రాలన్నీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేకపోయాయి. అయినప్పటికీ ఈ భామ క్రేజ్, డిమాండ్ ఏ మాత్రం తగ్గలేదు. టాలీవుడ్లో వరుసగా క్రేజీ ఆఫర్లు దక్కించుకుంటూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. తెలుగుతో పాటు 'కాంత' అనే సినిమాతో తమిళ ఇండస్ట్రీలోకి కూడా అడుగుపెట్టింది. ఇటీవల 'ఆంధ్రా కింగ్ తాలూకా' చిత్రంతో ప్రేక్షకులను అలరించిన భాగ్యశ్రీ.. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ శివకార్తికేయన్ సరసన 'సెయాన్' సినిమాలో నటిస్తూ ఫుల్ బిజీగా ఉంది. అలాగే తెలుగులో అక్కినేని అఖిల్ నెక్స్ట్ మూవీ 'లెనిన్'లో హీరోయిన్గా నటిస్తోంది. ఈ క్రమంలోనే భాగ్యశ్రీ బోర్సేకు సంబంధించిన వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. టాలీవుడ్, కోలీవుడ్ తర్వాత ఈ బ్యూటీ ఇప్పుడు మాలీవుడ్ ఇండస్ట్రీలోకి కూడా గ్రాండ్గా ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు టాక్ నడుస్తోంది.

మలయాళ సూపర్ స్టార్ మోహన్లాల్ నటిస్తున్న ఒక భారీ బడ్జెట్ సినిమాలో భాగ్యశ్రీ ఒక కీలకమైన పాత్రకు ఎంపికైనట్లు సమాచారం. టాలెంటెడ్ డైరెక్టర్ విష్ణు మోహన్ దర్శకత్వంలో తెరకెక్కబోతున్న ఒక హై-వోల్టేజ్ సర్వైవల్ థ్రిల్లర్ చిత్రంలో ఆమె నటించనుందనే వార్త నెట్టింట వైరల్ అవుతోంది. ఈ సినిమా కథాంశం చాలా పవర్ఫుల్గా ఉండబోతోందని తెలుస్తోంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం జరిగిన సమయంలో అక్కడ చిక్కుకుపోయిన భారతీయ పౌరులను, విద్యార్థులను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడం కోసం భారత ప్రభుత్వం చేపట్టిన అత్యంత ప్రతిష్టాత్మకమైన సీక్రెట్ మిషన్ ఆపరేషన్ గంగ నేపథ్యంలో ఈ సినిమా కథ సాగనుంది. ఇంతటి భారీ దేశభక్తి చిత్రంలో భాగ్యశ్రీ బోర్సేకి ఒక ఇంపార్టెంట్ రోల్ దక్కడం విశేషం. ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ ఆగస్టు మొదటి వారంలో జార్జియాలో ప్రారంభం కానుందని తెలుస్తోంది.



## ఆ అనుభూతి మర్చిపోలేను

యంగ్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ 'సీతారామం' సినిమాతో ఓవర్ నైట్ స్టార్గా మారిపోయారు. ఆ తర్వాత తెలుగులో పలు చిత్రాల్లో నటించిన ఆ భామ ఫుల్ క్రేజ్ రాబట్టుకున్నారు. తన యాక్టింగ్, అందం, అభినయంతో ప్రశంసలు పొందుతూ ఇండస్ట్రీలో రాణిస్తున్నారు. ఇక మృణాల్ ఇటీవల నటించిన సినిమా 'డెకాయిట్'. ఇందులో ఆమె యాక్టింగ్కు ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. అయినప్పటికీ ఈ మూవీ మాత్రం బాక్సాఫీసు వద్ద హిట్ అందుకోలేకపోయింది. ప్రస్తుతం మృణాల్ ఖాతాలో ఎలాంటి ప్రాజెక్ట్ లేకపోవడంతో సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ పలు పోస్టులు షేర్ చేస్తున్నారు. తమ్ముడి గ్రాడ్యుయేషన్ కోసం అమెరికా వెళ్లిన మృణాల్.. సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. ''నా హృదయం సంతోషంతో నిండిపోయింది. నా కలల్లో ఒకటి నిజమవ్వడం.. అది కూడా నువ్వు అంత సులువుగా సాధించడం కళ్లారా చూడటం చాలా ప్రత్యేకమైన అనుభూతి. నిన్ను చూస్తే నాకు చాలా గర్వంగా ఉంది. నువ్వు ఎదుగుతున్న తీరు, నిజంగా నువ్వు ఎంత మంచి అబ్బాయివో, మనసున్న వాడివో చూస్తుంటే ముచ్చటేస్తోంది. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినందుకు అభినందనలు బేటా. నీ భవిష్యత్తు చాలా అద్భుతంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. నిజం చెప్పాలంటే.. నాకేదో సినిమా సీన్లో ఉన్నట్లు అనిపించింది. హేహే.. ఆ గ్రాడ్యుయేషన్ వేడుక అంత అందంగా జరిగింది.. ఈ అనుభూతిని నా జీవితాంతం మర్చిపోలేను'' అని రాసుకొచ్చారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151, And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.